## చిరుతతో పోరాడి.. కూతురి ప్రాణాల్ని కాపాడి..

ముంబయి, జూన్ 22: తన కుమార్తె ప్రాణాలు కాపాడేందుకు ఓ తండ్రి ఏకంగా చిరుతతోనే పోరాడాడు. అసాధారణ ధైర్యంతో క్రూరమృగం నుంచి చిన్నారిని కాపాడాడు. కూతురి కోసం తండ్రి చేసిన ఈ పోరాటాన్ని స్థానికులు ప్రశంసిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి మహారాష్ట్రలోని గుంజలే బస్తీలోకి ఓ చిరుత చొరబడింది. అదే సమయంలో దీపాలి అనే మహిళ తన నాలుగేళ్ల కుమార్తెతో కలిసి పొలం నుంచి ఇంటికి వెళ్తున్నారు. పక్కనే ఉన్న పొదల్లో మాటువేసిన చిరుత ఒక్కసారిగా వారిపై దాడి చేసి, చిన్నారిని పొలాల్లోకి లాక్కెళ్లింది. దీంతో సాయం కోసం ఆ మహిళ కేకలు వేయడంతో అక్కడే ఉన్న చిన్నారి తండ్రి మనోజ్ గుంజలే (32) చిరుత వెళ్లిన వైపు పరుగు తీశాడు. ప్రాణాలకు తెగించి రాళ్లు, కర్రలతో చిరుతపై దాడి చేసి.. తన కూతురిని కాపాడాడు. అక్కడి నుంచి పరుగున వస్తుండగా పొలంలో ఉన్న బావిలో పడిపోయాడు. అప్పుడు కూడా తన కుమార్తెకు ఎలాంటి గాయాలు కాకుండా కాపాడాడు. బావిలో నుంచి వారిని సురక్షితంగా బయటకు తీసిన స్థానికులు మనోజ్‌ను అతడి కుమార్తెను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఇద్దరి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు పేర్కొన్నారు.

## శ్రీశైలం భక్తులకు మహా వరం..

మార్కాపురం,జూన్, 22,(మనం న్యూస్): శ్రీశైలం మహాక్షేత్రానికి వెళ్లే కోట్లాది మంది భక్తులకు ఇక ప్రయాణం మరింత సులభం కానుందని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి తెలిపారు. దశాబ్దాలుగా ఘాట్ రోడ్లలో భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రమాదకర మలుపులు, ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం భారీ ప్రణాళికకు శ్రీకారం చుట్టిందన్నారు. సుమారు రూ.12,000 కోట్ల వ్యయంతో శ్రీశైలం కారిడార్ నిర్మాణానికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఆధ్యాత్మిక పర్యాటక రంగానికి కొత్త ఊపిరి పోసే ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పూర్తయితే శ్రీశైలం యాత్ర మరింత వేగవంతంగా, సురక్షితంగా మారనుందని డాక్టర్ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న శైవ భక్తులకు ఇది ఒక మహా వరంగా నిలవనుందన్నారు. కేవలం రహదారి నిర్మాణానికే పరిమితం కాకుండా ప్రాంతీయ అభివృద్ధి, పర్యాటక రంగ విస్తరణ, ఉపాధి అవకాశాల సృష్టికి కూడా ఈ కారిడార్ దోహదపడుతుందని తెలిపారు. దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను ఆధునిక సదుపాయాలతో అనుసంధానం చేయాలనే ప్రధాని నరేంద్ర మోదీ దూరదృష్టికి ఈ ప్రాజెక్టు మరో నిదర్శనమని ఆయన అన్నారు. కాశీ విశ్వనాథ్ కారిడార్, మహాకాళ్ లోక్, అయోధ్య అభివృద్ధి వంటి మహత్తర కార్యక్రమాల అనంతరం ఇప్పుడు శ్రీశైలం అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు.

ఆధ్యాత్మికతకు ఆధునికతను జోడిస్తూ భారతీయ సంస్కృతి, సాంప్రదాయ వైభవాన్ని ప్రపంచానికి చాటిచెబుతున్న నాయకుడు ప్రధాని నరేంద్ర మోదీ అని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి కొనియాడారు. ఎన్డీయే ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చారిత్రాత్మక నిర్ణయం వల్ల శ్రీశైలం క్షేత్రం అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా మరింత వెలుగొందే అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు.

భక్తుల సౌకర్యమే లక్ష్యంగా, అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం మరోసారి తన సంకల్పాన్ని చాటుకుందని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు.

## స్వర్ణాంధ్ర లక్ష్యాలపై ప్రణాళికా విభాగం ఎంఓయూ

(మొదటి పేజీ తరువాయి)

పాటు కార్యక్రమం అమలుపై ఐఎఫ్ఎంఆర్ సంస్థ పర్యవేక్షణ చేయనుంది. జీరో పావర్టీ మిషన్, వాటర్ సెక్యూరిటీ, డీప్ టెక్ మిషన్లపై ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ రీసెర్చి సంస్థ రాష్ట్రంలో ప్రభుత్వంతో పనిచేయనుంది. ఈ ఒప్పందంలో భాగంగా క్షేత్రస్థాయిలో అధ్యయనం, విధాన పరమైన సూచనలు అందిస్తుంది. ఈ 10 సూత్రాలకు సంబంధించి కొత్త పద్దతులకు సిఫారసు చేస్తుంది. తదుపరి దశల్లో మిగిలిన అంశాలపై పనిచేయాలని నిర్ణయించారు. పది సూత్రాల అమలుపై రాష్ట్రస్థాయి కమిటీతో పాటు మిషన్ వర్కింగ్ గ్రూప్లను కూడా ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలోని వివిధ రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు డీప్ టెక్ను ఇంటిగ్రేషన్ చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఏఐ స్కిల్లింగ్, డ్రోన్ మ్యాపింగ్ ఆటోమొబైల్, మెటల్స్, స్టీల్, రేర్ ఎర్త్ మినరల్స్, సెమీ కండక్టర్స్, డిఫెన్స్ లాంటి రంగాల్లో ప్రాజెక్టులు ఏపీకి వచ్చాయని అన్నారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీని కూడా రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి పయ్యావుల కేశవ్, కేఆర్ఈఏ, ఐఎఫ్ఎమ్ఆర్ ప్రతినిధులు, ప్రణాళికా విభాగం అధికారులు హాజరయ్యారు.

## మోదీ యుగంలో భారత ప్రగతిని ప్రతిబింబించే గ్రంథం

అమరావతి జూన్ 22 (మనం న్యూస్): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం సాధించిన అభివృద్ధి, పరివర్తన, ప్రపంచ వేదికపై దేశ ప్రతిష్ఠ పెరుగుదలను ప్రతిబింబించే 'భారత్ రైజింగ్ ఇన్ ది మోదీ ఎరా' పుస్తకాన్ని ప్రముఖ రచయిత, బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్చార్జి డాక్టర్ కిలారి దిలీప్ సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మర్యాదపూర్వకంగా బహూకరించారు.ఈ సందర్భంగా పుస్తకాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రచయితను అభినందించారు. మోదీ నాయకత్వంలో దేశం సాధించిన ప్రగతి, ప్రపంచ నాయకత్వ దిశగా భారత్ వేస్తున్న అడుగులు, వివిధ రంగాల్లో నమోదైన మార్పులు, విజయాలను ఈ గ్రంథం విశ్లేషణాత్మకంగా ఆవిష్కరించిందని పేర్కొన్నారు.భారతదేశ అభివృద్ధి ప్రయాణాన్ని అర్థం చేసుకోవాలనుకునే పాఠకులకు ఈ పుస్తకం ఉపయోగకరమైన మార్గదర్శిగా నిలుస్తుందని సీఎం అభిప్రాయపడ్డారు. రచయిత కిలారి దిలీప్ మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వ హయాంలో దేశంలో చోటుచేసుకున్న సాంకేతిక ఆవిష్కరణలు, మౌలిక సదుపాయాల విస్తరణ, ఆర్థిక సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలు, అంతర్జాతీయ వేదికలపై భారత ప్రతిష్ఠ పెరుగుదల వంటి కీలక అంశాలను గ్రంథంలో సమగ్రంగా పొందుపరిచినట్లు తెలిపారు.

## ఏపీ హాజీల పవిత్ర హజ్ యాత్ర ముగింప

గుంటూరు, జూన్ 22,(మనం న్యూస్): పవిత్ర హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఆంధ్రప్రదేశ్కు చెందిన హాజీలు సోమవారం మూడు విమానాల ద్వారా సురక్షితంగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. హజ్ యాత్ర ముగింపు సందర్భంగా మొత్తం 355 మంది హాజీలు సోమవారం హైదరాబాద్ చేరుకోవడంతో యాత్రికుల కుటుంబాల్లో ఆనందం నెలకొంది. ఆంధ్రప్రదేశ్లో గన్నవరం ఎయిర్పోర్ట్ నుంచి 330 మంది తెలంగాణలోని శంషాబాద్ ఎయిర్పోర్టుకు ఏపీ జాతికులు 355 మంది స్వదేశాలకు చేరుకున్నారని హజ్ కమిటీ చైర్మన్ హసన్ భాష చెప్పారు. ఆంధ్రప్రదేశ్కు చెందిన హాజీలందరూ సురక్షితంగా హైదరాబాద్కు చేరుకున్నట్లు హజ్ కమిటీ వర్గాలు తెలిపాయి.

ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ ఆఫ్జల్, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హాజీ హసన్ బాషా, తెలంగాణ హజ్ కమిటీ డైరెక్టర్లు, ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ డైరెక్టర్, హజ్ కమిటీ సిబ్బంది హాజీలకు ఘన స్వాగతం పలికారు. హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని క్షేమంగా స్వదేశానికి చేరుకున్న ప్రతి హాజీకి వారు శుభాకాంక్షలు తెలియజేశారు. హజ్ యాత్రికుల సేవలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది, వాలంటీర్ల కృషిని ఆయన అభినందించారు. పవిత్ర హజ్ యాత్ర ముగింపుతో హాజీల కుటుంబ సభ్యులు, ముస్లిం సమాజ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

## మానవీయ కోణంలో పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

ఆధారంగా బాధ్యతలు అప్పగిస్తాం. అర్జీదారుల స్థానంలో ఉండి ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి సారించాలి. సమస్య పరిష్కారం కోసం అధికారులు, ఉద్యోగుల వద్దకు వచ్చే పౌరులతో సౌమ్యంగా వ్యవహరించాలి. దీని ద్వారా పాలనపై ప్రజల్లో మంచి భావన కలుగుతుంది. మానవ వనరులను సద్వినియోగం చేసుకోవాలి. ఎప్పటికప్పుడు ఉద్యోగులు పాలనా పరంగా సామర్థ్యాలను పెంచుకోవాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా పని విధానం మార్చుకోవాలి. క్షేత్ర స్థాయిలో పర్యటిస్తేనే వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోగలుగుతాం. మంత్రులు, అధికారులు, ఉద్యోగులు క్షేత్ర స్థాయి పర్యటనలకు ప్రాధాన్యమివ్వాలి. ఏపీకి బలమైన మానవ వనరుల వ్యవస్థ అవసరం. పాలనలో సంస్కరణలపై ఉద్యోగులకు, అధికారులకు శిక్షణ ఇప్పించాం. పాత రోజుల్లో ఫైళ్ల క్లియరెన్స్ అనేది అతి పెద్ద టాస్క్ గా ఉండేది. టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాక సులభంగా వాటిని క్లియర్ చేయగలిగే పరిస్థితి ఉంది. వినూత్నంగా ఆలోచన చేయకపోతే వ్యవస్థలు నిర్వీర్యం అవుతాయి.అని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

**పాత కేసుల ట్రేసింగ్**

రాష్ట్రంలో కుట్రలు పన్నే పార్టీలు ఉన్నాయి. ప్రతి అంశాన్ని రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. వివిధ సంఘటనలకు కులం, మతం అనే రంగు పులుముతున్నారు. వాటిని వివాదాస్పద అంశాలుగా మార్చేస్తున్నారు. ఫేక్ ప్రచారం చేస్తూ ఉద్యోగులను, అధికారులను బద్నాం చేస్తున్నారు. ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ దుష్ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి విషయాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలి. తప్పుడు ప్రచారాలను, విద్వేషాలు పెంచే ఘటనల్ని కంట్రోల్ చేసేలా ఉద్యోగులు, అధికారులు అప్రమత్తతతో వ్యవహరించాలి. ఇటీవల కాలంలో మానసిక సమస్యల కారణంగా కూడా కొంత మంది నేరాలకు పాల్పడుతున్నారు. డ్రగ్స్, గంజాయిలకు అలవాటు పడి తప్పు దారి పడుతున్నారు. పాత కేసులను పరిష్కరిస్తున్నాం. 2019లో జరిగిన కొన్ని నేరాలను ఇప్పుడు ట్రేస్ చేసి పట్టుకుంటున్నారు. శిక్షలు కూడా పడుతున్నాయి. ఇలాంటివి ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. తప్పు చేసిన వాడు ఎప్పుడూ తప్పించుకోలేడు. వాహనాల నెంబర్ ప్లేట్ల విషయంలో నిబంధనలను పక్కాగా పాటించాలి. ప్రమాణాల ప్రకారం నెంబర్ ప్లేట్లు అమర్చుకోవాలి. డిసెంబర్ నెలలో క్వాంటం కంప్యూటర్ లాంఛ్ చేయాల్సి ఉంది. ఈలోగా క్వాంటం పార్కు, సెమీ కండక్టర్ల పార్క్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో పచ్చదనం పెంపు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, నీటి భద్రత, భూగర్భ జలాల పెంపు, నీటి వనరుల సంరక్షణ, నదీ జలాలను కాలుష్యం నుంచి కాపాడడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 50 అంగన్వాడి కేంద్రాల సమగ్ర అభివృద్ధికి కృషి

(మొదటి పేజీ తరువాయి)

మరియు సమాజ శ్రేయస్సును బలోపేతం చేయడానికి మా ప్రయత్నాలకు అంగన్వాడీ కేంద్రాలు మూలాధారం అన్నారు. ఈ భాగస్వామ్యం పిల్లలు మరియు సంరక్షకుల కోసం సురక్షితమైన, మరింత పరిశుభ్రమైన మరియు మెరుగైన సౌకర్యాలతో కూడిన కేంద్రాలను రూపొందించడంలో సహాయపడుతుందన్నారు. డియాజియో భారతదేశం యొక్క అర్థవంతమైన అభివృద్ధికి తోడ్పాటునందించటానికి అభినందిస్తున్నామన్నారు.

డియాజియో ఇండియా (యుఎస్ఎల్)లో కార్పొరేట్ రిలేషన్స్ డైరెక్టర్ దేవాశిష్ దాస్గుప్తా మాట్లాడుతూ కమ్యూనిటీల కోసం భాగస్వామ్య విలువను సృష్టించడం మా స్పిరిట్ ఆఫ్ ప్రోగ్రెస్ ఎజెండాలో ప్రధానమైనదన్నారు. అంగన్వాడీ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి మరియు సురక్షితమైన, పిల్లలకు అనుకూలమైన మరియు పరిశుభ్రమైన ప్రదేశాలకు ప్రాప్యతను మెరుగుపరచడానికి కాకినాడ జిల్లా పరిపాలన మరియు టార్క్ ఫౌండేషన్తో భాగస్వామ్యం కావడం మాకు గర్వకారణం అన్నారు.

టార్క్ ఫౌండేషన్ మద్దతుతో, ఈ చొరవ పరిశుభ్రత సౌకర్యాలను మెరుగుపరచడం, సురక్షితమైన నీటి యాక్సెస్, పిల్లల భద్రతా చర్యలు, నిల్వ సౌకర్యాలు మరియు తీరప్రాంత వర్గాలలో వాతావరణ తట్టుకునే మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా క్లిష్టమైన ప్రారంభ బాల్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. అంగన్వాడీ కార్యకర్తలు మరియు సంరక్షకులకు సేవా బట్వాడాను పటిష్టం చేస్తూ చిన్న పిల్లల ఆరోగ్యం, పోషకాహారం, అభ్యాసం మరియు శ్రేయస్సుకు తోడ్పడే సురక్షితమైన, పరిశుభ్రమైన మరియు మరింత బాల స్నేహపూర్వక వాతావరణాలను ఈ కార్యక్రమం సృష్టించాలని భావిస్తున్నానన్నారు.

టార్క్ ఫౌండేషన్ వ్యవస్థాపక భాగస్వామి మనోవిరాజ్ సింగ్ మాట్లాడుతూ, 'బలమైన సంస్థలపై బలమైన కమ్యూనిటీలు నిర్మించబడ్డాయి మరియు అంగన్వాడీ కేంద్రాలు వారి నిర్మాణ సంవత్సరాల్లో పిల్లలను ఆదుకునే అతి ముఖ్యమైన సంస్థలలో ముఖ్యమైనవి అని చెప్పారు.

## రైతన్నకోసమే కూటమి ప్రభుత్వం

అమరావతి, జూన్ 22,(మనం ప్రత్యేక ప్రతినిధి): ఖరీఫ్-2026 వ్యవసాయ సీజన్కు సంబంధించి రాష్ట్రంలో ఎరువుల లభ్యత, పంపిణీ, నిల్వలు, సరఫరా పరిస్థితులపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, వివిధ ఎరువుల తయారీ సంస్థల ప్రతినిధులు, డీలర్ల సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు అవసరమైన మేరకు మాత్రమే కాకుండా, అవసరానికి మించి కూడా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా యూరియా సరఫరాలో ఎటువంటి కొరత లేకుండా అధికారులు, కంపెనీలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. యూరియా లేదా డీఏపీ కొనుగోలు చేసే రైతులకు బలవంతంగా కాంప్లెక్స్ ఎరువులు విక్రయించే ధోరణిని వెంటనే నిలిపివేయాలని మంత్రి స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన ఎరువులను మాత్రమే అందించాలని, అనవసరమైన ఉత్పత్తులను బలవంతంగా విక్రయించడం సహించబోమని హెచ్చరించారు. రైతులను ఇబ్బందులకు గురిచేసే డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయడమే కాకుండా, సంబంధిత కంపెనీలపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎంఆర్పీ ధర కంటే ఎక్కువ ధరలకు యూరియా విక్రయించడం చట్టవిరుద్ధమని పేర్కొన్న మంత్రి, రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఎరువుల డీలర్లు ఎంఆర్పీ ధరకే విక్రయాలు జరపాలని ఆదేశించారు. ఎవరైనా అధిక ధరలకు విక్రయించినట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎరువుల పంపిణీలో పారదర్శకతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్న మంత్రి, యూరియా పక్కదారి పట్టకుండా ప్రత్యేక విజిలెన్స్ బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఎరువుల బస్తాకు పూర్తి లెక్క ఉండేలా పటిష్ట పర్యవేక్షణ వ్యవస్థను అమలు చేయనున్నట్లు తెలిపారు. గతంలో జరిగిన అక్రమాలు, అవకతవకలు పునరావృతమైతే ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని హెచ్చరించారు. రైతులకు ఎరువుల బుకింగ్ కోసం అందుబాటులో ఉన్న యాప్ నిర్వహణ మరింత సజావుగా ఉండాలని మంత్రి సూచించారు. ముఖ్యంగా కౌలు రైతులు, ఆండ్రాయిడ్ ఫోన్ లేని రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఓటీపీలు ఆలస్యంగా రావడం, మెసేజ్ లింకులు సకాలంలో అందకపోవడం వంటి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులతో పాటు పర్యావరణ హిత విధానాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. నానో యూరియా వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. అదే సమయంలో సహజ వ్యవసాయంపై రైతుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోందని, దీనిని మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రసాయన ఎరువుల అధిక వినియోగం వల్ల నేల సారంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్న మంత్రి, సాధ్యమైనంత మేర రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సమతుల్య పోషకాల వినియోగంపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. అధిక ఎరువుల వినియోగం పట్ల అప్రమత్తంగా ఉండాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల సంక్షేమం, ప్రయోజనాలే అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేసిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఖరీఫ్ సీజన్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ మంజీర్ జిలానీ, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ఇనోవేషన్ శాఖ నూతన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన డా. హనుమంతు పురుషోత్తం

(మొదటి పేజీ తరువాయి)



సచివాలయంలో 5 వ బ్లాక్ లో ఆయన ఛాంబర్ లో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్ ఛార్జ్ హోదాలో బాధ్యతలు నిర్వర్తిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించడం జరిగింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ ను డా. హనుమంతు పురుషోత్తం మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పురుషోత్తంకు సీఎస్ అభినందనలు తెలిపారు. శాస్త్రవేత్తగా, ఆవిష్కరణల ప్రోత్సాహకునిగా, విద్యావేత్తగా మరియు పరిపాలనాధికారిగా.. సైన్స్ టెక్నాలజీ, ఇన్నోవేషన్, పరిశోధన మరియు అభివృద్ధి (ఖ), మేధో సంపత్తి హక్కులు (ఐఖఖ), సాంకేతిక పరిజ్ఞాన బదిలీ మరియు సంస్థాగత అభివృద్ధి రంగాలలో దాదాపు 4 దశాబ్దాల అపార అనుభవాన్ని ఆయన కలిగి ఉన్నారు. దేశంలోని ప్రముఖ జాతీయ సంస్థల్లో కీలక నాయకత్వ బాధ్యతలు నిర్వహిస్తూ భారతదేశ విజ్ఞాన, సాంకేతిక మరియు ఆవిష్కరణ వ్యవస్థ బలోపేతానికి ఆయన ఎంతగానో కృషి చేశారు.

ప్రస్తుతం సైన్స్ టెక్నాలజీ ఇన్నోవేషన్ శాఖ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించడానికి ముందు డా. పురుషోత్తం కేంద్ర ప్రభుత్వ విజ్ఞాన మరియు సాంకేతిక మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ రీసెర్చ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (గ్రాఖ్యఇ) కు ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్గా పనిచేశారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ మెడ్టెక్ జోన్ (అఖీో) పరిధిలోని ఉఖఅఆ గ్లోబల్ ఇన్స్టిట్యూట్ ఫర్ మెడికల్ టెక్నాలజీకి డైరెక్టర్గా, ఆంధ్ర యూనివర్సిటీ ఖ్రఐఐఖీ-ఐఖఖ చైర్ ప్రొఫెసర్గా సేవలందించారు. ఈ పదవుల ద్వారా ఆవిష్కరణలు, మేధోసంపత్తి సృష్టి, సాంకేతిక వాణిజ్యీకరణ మరియు పరిశ్రమ-విద్యాసంస్థల భాగస్వామ్యాలను ప్రోత్సహించడం లో ఆయన కీలక పాత్ర పోషించారు. తనపై అపారమైన నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కూటమి ప్రభుత్వానికి ఆయన ప్రత్యేకంగా ధన్యవాధాలు తెలిపారు. రాష్ట్రంలో విజ్ఞాన, సాంకేతిక మరియు ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే తన ఆలోచనలను ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.

సమగ్ర మరియు సుస్థిర అభివృద్ధి కోసం సమాచార సాంకేతిక శాఖ, విద్యాశాఖ, పరిశ్రమల శాఖ, ఆరోగ్య శాఖ, వ్యవసాయ శాఖ, నైపుణ్యాభివృద్ధి శాఖలతో పాటు ఇతర అనుబంధ శాఖల మధ్య సమన్వయం మరియు సహకారాన్ని పెంపొందించడం అవసరమని పేర్కొన్నారు. వ్యూహాత్మక భాగస్వామ్యాలు మరియు పరివర్తనాత్మక కార్యక్రమాల ద్వారా విజ్ఞానశాస్త్రం, సాంకేతికత, ఆవిష్కరణలు, పరిశోధన మరియు పారిశ్రామికత రంగాలలో ఆంధ్రప్రదేశ్ను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలపడానికి కట్టుబడి ఉన్నట్లు డా. పురుషోత్తం తెలిపారు. నూతన భాధ్యతలు స్వీకరించిన డా. హనుమంతు పురుషోత్తం అపార అనుభవం, దూరదృష్టి గల నాయకత్వం, రాష్ట్ర విజ్ఞాన, సాంకేతిక ఆవిష్కరణ రంగాల అభివృద్ధికి విశేషంగా దోహదపడుతుందని రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ (ఎఐ) ప్రధాన కార్యదర్శి జె. శ్యామలరావు, ఐఅఖీ విశ్వాసం వ్యక్తం చేశారు. డా. కె. శరత్ కుమార్, సభ్య కార్యదర్శి సీఈఓ, ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ (అ్యఐఖీఖీ) పురుషోత్తంకి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## దేశ సంపదను కాపాడే గిరిజన సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం

ఏలూరు/బుట్టాయిగూడెం, జూన్ 22,(మనం న్యూస్): బుట్టాయిగూడెం మండలం కోటరామచంద్రపురం ఐటిడిఏ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ట్రైకార్ చైర్మన్ బోరగం శ్రీనివాసరావు లు, సంబంధిత అధికారులతో కలిసి రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధ్యక్షతన, పోలవరం నియోజకవర్గం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. శాఖలు, మండలాలు వారీగా రెండేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పూర్తి అయినవి, పెండింగ్లో ఉన్న పనులు, చేయవలసిన పనులను సుధీర్ఘంగా మంత్రి సమీక్షించారు. అనంతరం ప్రజలు నుండి అర్జీలను మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే చిర్రి బాలరాజులు స్వీకరించారు. స్వర్ణ పోలవరం న్యూస్ లెటరు బుక్కులెట్స్ ను ఆవిష్కరణ.

**అంగన్వాడీ కేంద్రాలకు విద్యుత్తు పొయ్యిలు అందించారు.**

ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ దేశ సంపదను కాపాడే గిరిజనులు సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని, గిరిజన ప్రాంతాలకు పూర్వవైభవం తీసుకు వచ్చేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పిన విధంగా ఒక కుటుంబంలో ఒకరికి తప్పనిసరిగా ఉపాధి కల్పించేందుకు ప్లాన్ ఆఫ్ యాక్షన్ సిద్ధం చేసి, పక్కాగా అమలు చెయ్యాలని అన్నారు. రాష్ట్రంలో ఒకేరోజు 13 వేలు గ్రామ సభలు నిర్వహించి, పూజ్యభాపూజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం కొరకు ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు. రాష్ట్రంలో 7 వేలు కిలోమీటర్లు సీసీ రోడ్డులు వేశామని అన్నారు. పోలవరం ప్రాజెక్టు ఆర్అర్ కు సంబంధించి ఏవైనా సమస్యలుంటే వాటిని విచారణ చేసి త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. గిరిజన ప్రాంతంలోని ఏడు మండలాల్లో ఉపాధిహామీ కింద రూ 30 కోట్లతో రహదారులను అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలు పాటించి, నిర్ణీత సమయంలోగా పూర్తి చెయ్యాలని ఆదేశించారు. గిరిజన సమస్యలు పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమానికి అధికార్లు మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని అన్నారు. గత ఐదుఏళ్లలో అభివృద్ధి, సంక్షేమం ఈ రెండు ఏళ్లలో జరిగిన కార్యక్రమాలు పూర్తి వివరాలు అందరికీ తెలిసేలా స్వర్ణగ్రామ సచివాలల్లో డిస్ ప్లే చెయ్యాలని ఆదేశించారు. గిరిజనులకు రాజ్యాంగ పరమైన హక్కులు, సంక్షేమ పథకాలు ప్రయోజనాలు సక్రమంగా అందేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. గిరిజన సమస్యలు పరిష్కారంకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ జిల్లాలో గిరిజన సమస్యలు పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. పిజిఆర్ఎస్ లో వచ్చిన అర్జీలు సత్వరమే పరిష్కరించాలని అన్నారు. ఇప్పటివరకు విద్యుత్తు సౌకర్యం లేని గిరిజన ప్రాంతంలోని రెండు మండలాల్లో మూడు గ్రామాలకు సోలార్ విద్యుత్తు సౌకర్యం కల్పించుట శుభ పరిణామం అని, అభినందిస్తూ ఇదే స్ఫూర్తితో ప్రతి గిరిజన ఇంటికి సోలార్ ప్యానెల్స్ ఉండేలా గిరిజనులకు అవగాహన కల్పించాలని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఇండ్లకోసం చేసుకున్న ధరఖాస్తులు పరిశీలన చేసి మంజూరుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.

నిరుద్యోగ యువతకు పరిశ్రమలు స్థాపనకు అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. జాబు మేళాలు నిర్వహించి చదువుకున్న గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. గిరిజన ప్రాంతంలో విద్యార్థులు తక్కువగా ఉన్న యువతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి వారికి ఉపాధి కల్పించేందుకు పక్కా ప్రణాళికలతో అమలు చేసి లక్ష్యాలను అధికమించాలని అన్నారు. పశువులు, మేకలు, గొర్రెలు, తదితర జీవాలు పెంపకానికి రుణాలు కోరిన గిరిజనులకు ఈ ఆర్థిక సంవత్సరంలో నూటికి నూరుశాతం రుణాలను మంజూరు చేయించాలని మంత్రి స్పష్టం చేశారు. డ్వాక్రా మహిళలకు వివిధ వ్యాపారాలకు ఉదారంగా బ్యాంకు రుణాలు మంజూరు చేసేలా అధికారులు కృషిచెయ్యాలని అన్నారు.

## కొరియా రాయబారి లీ సియోంగ్ హోతో మంత్రి లోకేష్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

కొరియన్ కంపెనీల విస్తరణ, భవిష్యత్తులో ఇరుదేశాల నడుమ మరింత సహకారానికి ఉన్న అవకాశాలపై చర్చించారు. సెమీకండక్టర్లు, మైక్రో ఎలక్ట్రానిక్స్, స్టోరేజ్, నౌకా నిర్మాణం, ఎలక్ట్రిక్ వాహనాల రంగాల్లో కొరియా ప్రపంచ అగ్రగామిగా ఉంది. భారతదేశంలో కొరియన్ కంపెనీలకు ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ఏ విధంగా దీర్ఘకాలిక భాగస్వామిగా నిలవగలదనే అంశంపై మంత్రి లోకేష్ చర్చించారు.

## పవన్ హోదాకు తగినట్లు మాట్లాడాలి

(మొదటి పేజీ తరువాయి)

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి పరామర్శించడాన్ని కూడా రాజకీయ కోణంలో చూడటం సరికాదన్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన చర్యలపై అధికార పక్షం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.పవన్ కళ్యాణ్ మాటల్లో స్థిరత్వం లేదని, జనసేన కార్యకర్తల ఆశయాలను గత 15 ఏళ్లుగా టీడీపీకి తాకట్టు పెట్టారని ఆరోపించారు. రాష్ట్రంలో రౌడీయిజం, గూండాయిజంపై మాట్లాడే ముందు అధికార పక్షం తన వైఖరిని సమీక్షించుకోవాలని సూచించారు.పవన్ కళ్యాణ్ అభిమానులే ప్రస్తుతం ఆయన వ్యవహార శైలిపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని బండి పుణ్యశీల వ్యాఖ్యానించారు. అలాగే మహిళలకు జరిగిన అన్యాయాల విషయంలో కూడా పవన్ కళ్యాణ్ స్పందన ప్రశ్నార్థకంగా ఉందని విమర్శించారు. రాజకీయాల్లో వ్యక్తిగత దూషణలు కాకుండా ప్రజా సమస్యలపై చర్చ జరగాలని ఆమె కోరారు.

## రోడ్డు ప్రమాదంఘటనపై జగన్ దిగ్భ్రాంతి

(మొదటి పేజీ తరువాయి)

మనోధైర్యాన్ని వారికి దేవుడు ప్రసాదించాలని ప్రార్థించారు. అదేవిధంగా ఈ ప్రమాదంలో గాయపడిన వారందరికీ అత్యవసరంగా మెరుగైన వైద్య సేవలు అందించి, వారి ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైయస్ జగన్ కోరారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలిచి, తగిన సహాయం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

## కార్మిక సంక్షేమ పథకాల అమలులో సాంకేతికతకు ప్రాధాన్యత

(మొదటి పేజీ తరువాయి)

డిజిటల్ వేదికలను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. 45వ బోర్డు సమావేశంలో సంక్షేమ పథకాల అమలు, నమోదు ప్రక్రియల సరళీకరణ, కార్మికుల భద్రత, సామాజిక భద్రతా కార్యక్రమాల విస్తరణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు.

ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ సెక్రటరీ ఎం వి శేషగిరి బాబు, కమిషనర్ గంధం చంద్రుడు వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ వెంకట శివుడు యాదవ్,వెల్ఫేర్ బోర్డు సభ్యులు వై. వెంకట రమణి, ఆరా మహేశ్వరి, అరవరాజు నేలపాల, గదుల సాయిబాబు, బి విశ్వనాథ నాయుడు,డి. నారపరెడ్డి, చింత రేణుక రాజు, నల్లగొప్పుల వెంకట చలపతిరావు, పిడుగు వెంకటరెడ్డి మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## దేవుడి సొమ్ము దేవుడికే.. సనాతన ధర్మ రక్షణే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

చేసి, ఏపీని నూతన ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రకటించారు. గత వైసిపి ప్రభుత్వ ఐదేళ్ల అస్తవ్యస్త పాలనలో ఒక్క విభాగానికి కూడా అధిపతి లేకుండా దేవాదాయ శాఖను నిర్వీర్యం చేశారని, లడ్డూ ప్రసాదం కల్తీ, రామతీర్థం, అంతర్వేది రథం దహనం వంటి అపచారాల చీకటి రోజుల నుంచి ఆలయాలను విముక్తం చేసి, భక్తులలో నమ్మకాన్ని, విశ్వాసాన్ని నూటికి నూరు శాతం పెంపొందించామని ఆయన స్పష్టం చేశారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి మీడియా సమావేశంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి... శాఖాపరమైన రెండేళ్ల సుపరిపాలన ప్రగతి, కోట్ల విలువైన ఆలయ భూముల సంరక్షణ, ఉద్యోగాల భర్తీ, మరియు 2027 ప్రతిష్టాత్మక గోదావరి పుష్కరాల రోడ్ మ్యాప్తో కూడిన సమగ్ర నివేదికను విడుదల చేశారు. తన నాలుగున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో దేవాలయాల సంక్షేమానికి ఏ రాజకీయ పార్టీ కూడా ప్రత్యేకంగా ఎన్నికల ప్రణాళికను రూపొందించిన దాఖలాలు తాను చూడలేదని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి గుర్తుచేశారు. కానీ నేటి కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలోనే దేవాదాయ శాఖకు ప్రత్యేక స్థానం కల్పించి, 11 ధార్మిక హామీలను ఇచ్చిందని, అందులో 10 హామీలను జీవోలతో సహా వంద శాతం అమలు చేసి చెప్పిన మాట నెరవేర్చుకున్నామని ఆయన ప్రకటించారు.

# పల్స్ పోలియో విజయానికి తల్లిదండ్రుల సహకారం అవసరం



- ఈ నెల 28న ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలి
- ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామాల్లో కేంద్రాల ఏర్పాటు

**పోడూరు జూన్ 22 మనం న్యూస్ :** ఈ నెల 28వ తేదీ ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో ఐదేళ్ల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని నరసాపురం విభాగ ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. వాకా ప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం పోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామాల్లో ఏర్పాటు చేసే పల్స్ పోలియో కేంద్రాలలో సిబ్బంది ద్వారా పిల్లలకు పోలియో చుక్కలు వేయించనున్నట్లు తెలిపారు.ఇంతకుముందు పోలియో చుక్కలు వేయించిన పిల్లలకు కూడా మళ్లీ ఈ కార్యక్రమంలో భాగంగా తప్పనిసరిగా వేయించాలని సూచించారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని అర్హులైన ప్రతి చిన్నారిని కేంద్రాలకు తీసుకురావాలని కోరారు.ప్రపంచ ఆరోగ్య సంస్థ భారతదేశాన్ని పోలియో రహిత దేశంగా ప్రకటించినప్పటికీ, పొరుగు దేశాలలో పోలియో వ్యాధి కొనసాగుతున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తోందని తెలిపారు.అలాగే రెండు,మూడవ రోజుల్లో ఇంటింటి సందర్శన కార్యక్రమాలు నిర్వహించి పోలియో చుక్కలు వేయించని పిల్లలను గుర్తించి వారికి కూడా చుక్కలు వేయనున్నట్లు తెలిపారు.అనంతరం ప్రసవం జరిగిన మహిళకు జనన ధృవపత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డా. ఎస్. శ్రీ వాసవి, సామాజిక ఆరోగ్య అధికారి కె.బి.కె.ఎస్. రమేష్ రెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారి జె. సత్యనారాయణ, ప్రజారోగ్య నర్సు ఎస్. మీరమ్మ, ఆరోగ్య సందర్శకురాలు సి.హెచ్.ఎస్.వి.ఎల్. పద్మకుమారి పాల్గొన్నారు.

# అవిలాలలో రూ.100 కోట్ల భూముల దందాపై కలెక్టర్‌కు ఎంపీపీ ఫిర్యాదు



**తిరుపతి రూరల్ జూన్ 22 మనం న్యూస్:** తిరుపతి రూరల్ మండలంలోని అవిలాల రెవెన్యూ గ్రామం సర్వే నంబర్ 476/1లో ఎస్సీ, ఎస్టీ మరియు అణగారిన వర్గాలకు కేటాయించిన విలువైన భూములను లక్ష్యంగా చేసుకుని భారీ భూదందా సాగుతోందంటూ మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు విడుదల మాధవరెడ్డి జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. సుమారు 100 కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ పరిరక్షిత భూమిలో అక్రమ లేఔట్లు ఏర్పాటు చేసి, ప్రభుత్వ కాలువను సైతం ఆక్రమించి ప్లాట్ల విక్రయాలకు తెరలేపారని ఆయన ఆరోపించారు.అసైన్డ్ భూములుగా ఉన్న ఈ భూముల్లో ఎటువంటి చట్టబద్ధ అనుమతులు లేకుండానే లేఔట్లు ఏర్పాటు చేస్తున్నారని, భూమిపై హక్కులు లేని వ్యక్తులు తప్పుడు పత్రాలు, నకిలీ ఆధారాలతో రిజిస్ట్రేషన్లు సృష్టించి చేతులు మారుస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు.

# మూడు టన్నుల పుష్పాలతో శ్రీ గోవిందరాజస్వామివారికి పుష్పయాగ మహోత్సవం

- భక్తి పారవశ్యంలో తేలిన ఆలయ ప్రాంగణం



**తిరుపతి జూన్ 22 మనం న్యూస్:** తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామివారి ఆలయంలో సోమవారం నిర్వహించిన పుష్పయాగ మహోత్సవం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల మధ్య జరిగింది. సుగంధభరిత పుష్పాలతో అలంకరించిన ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక సౌరభాలను వెదజల్లగా, భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు.ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామివారి ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీరు, పసుపు, చందనంతో అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు సమర్పించారు.అనంతరంమధ్యాహ్నం 1 గంట నుండి సాయంత్రం 4 గంటల వరకు వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ పుష్పయాగం ఘనంగా నిర్వహించారు. గత బ్రహ్మోత్సవాలు, నిత్యకైంకర్యాల్లో తెలిసీ తెలియక జరిగిన లోపాలకు ప్రాయశ్చిత్తంగా ఈ పుష్పయాగాన్ని నిర్వహించడం ఆలయ సంప్రదాయం.ఈ సందర్భంగా తులసి, చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి, రోజా, కలువలు తదితర 12 రకాల పుష్పాలు, తులసి, మరువం, దమనము, బిల్వం, పన్నీరాకు తదితర 6 రకాల పవిత్ర పత్రాలతో కలిపి మొత్తం మూడు టన్నుల పుష్పాలను స్వామి, అమ్మవార్లకు సమర్పించారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన దాతలు ఈ పుష్పాలను విరాళంగా అందించారు. సాయంత్రం స్వామివారు,అమ్మవార్లు ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగి భక్తులకు దివ్యమంగళ దర్శనం ప్రసాదించారు.ఈ కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈవో వి.ఆర్. శాంతి, ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ ఎస్. శ్రీనివాసులు, ఏఈవో ఏబీ నారాయణ చౌదరి, సూపరింటెండెంట్ శేషగిరి, ఆలయ ఇన్స్పెక్టర్ రంజిత్, ఆలయ అర్చకులు, అధికారులు, శ్రీవారి సేవకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# 'బాలామృతం ప్లస్' పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్

**తిరుపతి జూన్ 22 మనం న్యూస్:** తిరుపతి జిల్లాలోని చిన్నారులలో పోషకాహార లోపాన్ని నివారించే దిశగా ఒక ముఖ్యమైన అడుగు పడింది. జిల్లా కలెక్టరేట్లో 'బాలామృతం ప్లస్' పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ లాంఛనంగా ప్రారంభించారు. టాటా ట్రస్ట్స్ వారి సహకారంతో పనిచేస్తున్న విజయవాహిని ఫౌండేషన్ భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా తీవ్రమైన పోషకాహార లోపం మితమైన పోషకాహార లోపం తో బాధపడుతున్న 2,248 మంది చిన్నారులను మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు గుర్తించారు. వీరికి ఈ బాలామృతం ప్లస్ను ప్రత్యేకంగా పంపిణీ చేయనున్నారు. పోషకాహార లోపాన్ని సమూలంగా తగ్గించే లక్ష్యంతో ప్రతి చిన్నారికి నెలకు 3 కిలోల చొప్పున ఈ ఆహారాన్ని అందించనున్నారు. ఈ పంపిణీ నిమిత్తం జిల్లాకు మొత్తం 7,081 కిలోల బాలామృతం ప్లస్ సరఫరా చేయబడింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోవిందరావు జిల్లా మహిళా, శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారిణి వసంతబాయి, నోడల్ ఆఫీసర్ వాసంతి, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ అమరావతి మరియు విజయవాహిని ఫౌండేషన్ ప్రతినిధులు, తదితర అధికారులు పాల్గొన్నారు. చిన్నారుల ఆరోగ్య వికాసానికి ఈ బాలామృతం ప్లస్ ఎంతగానో దోహదపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# మామిడికాయల సేకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి



- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు, జూన్ 22 మనం న్యూస్:** జిల్లాలో మామిడికాయల సేకరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మామిడికాయల సేకరణ కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఫీల్ మరియు ర్యాంప్ స్థాయిలలో సిబ్బందిని ఉదయం, మధ్యాహ్నం షిఫ్టుల వారీగా నియమించామని, వారి పనితీరును పర్యవేక్షించేందుకు మండల మరియు జిల్లా స్థాయిలలో ప్రత్యేక సూపర్వైజర్ అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. సేకరణ కేంద్రాలకు వచ్చే రైతుల వివరాలు, సరుకు వివరాలు, వాహనాల సమాచారం తదితర అంశాలను నిర్దేశిత విధానాల ప్రకారం నమోదు చేయనున్నట్లు తెలిపారు. రైతులు సేకరణ కేంద్రాలకు తీసుకువచ్చే ప్రతి వాహనం వివరాలను సంబంధిత సిబ్బంది నమోదు చేస్తారని చెప్పారు.ప్రతిరోజూ ఉదయం 7.00 గంటల నుండి రాత్రి 8.00 గంటల వరకు మాత్రమే మామిడికాయల సేకరణ ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ సమయ వ్యవధిలో సేకరణ కేంద్రాలకు చేరుకున్న వాహనాలకు మాత్రమే ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నమోదు మరియు ఇతర సదుపాయాలు వర్తిస్తాయని తెలిపారు.రాత్రి 8.00 గంటల తరువాత వచ్చిన వాహనాలను ర్యాంప్ ప్రాంగణం నుండి బయటకు పంపబోమని, ఒకవేళ రైతులు స్వచ్ఛందంగా వాహనాలను బయటకు తీసుకెళితే అటువంటి సరుకులకు ప్రభుత్వ సబ్సిడీ వర్తించదని పేర్కొన్నారు.

# పూనేపల్లి గ్రామం 100% హెల్మెట్ గ్రామంగా ప్రకటింపు

**చిత్తూరు జూన్ 22 మనంన్యూస్:** చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఆదేశాల మేరకు, చిత్తూరు సబ్-డివిజనల్ పోలీస్ అధికారి జె. వెంకటనారాయణ పర్యవేక్షణలో, చిత్తూరు రూరల్ ఈస్ట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె. రామచంద్ర, పెనుమూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ డి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం పెనుమూరు మండలంలోని పూనేపల్లి గ్రామంలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్, ఎస్.ఐ రోడ్డు భద్రతపై గ్రామస్థులకు అవగాహన కల్పించడంతో పాటు, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. సమాజ సేవాభావంతో ముందుకు వచ్చిన అబ్దుల్ సలాం సహకారంతో సుమారు 50 మంది ద్విచక్ర వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేయడం జరిగింది. అలాగే హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చని అధికారులు వివరించారు. అనంతరం గ్రామస్థులతో కలిసి రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించి, బాధ్యతాయుతమైన వాహనదారులుగా వ్యవహరించాలని ఇన్స్పెక్టర్ గారు పిలుపునిచ్చారు



# భూ, సర్వే సమస్యలపై ప్రత్యేక దృష్టి



- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు, జూన్ 22 మనం న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కార వేదికలోలో వచ్చే అర్జీలను అత్యంత నాణ్యతతో నిర్దేశించిన సమయంలో గా పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. చిత్తూరు జిల్లాలోని కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, కలెక్టర్ తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ. రాజేంద్రన్ , కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీ స్వీకరించే కార్యక్రమంలో, అసిస్టెంట్ కలెక్టర్ బి. వెంకటేష్, డి ఆర్ ఓ మోహన్ కుమార్, ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్ పుల్లయ్య, డి పి ఎం మధుసూదన్, చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, కుప్పం ఆర్ డి.ఓ విజయలక్ష్మి మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. భూ వివాదాలు, సర్వే సమస్యలు, రెవెన్యూ సంబంధిత అంశాలపై ప్రజలు ఎక్కువగా ఫిర్యాదులు చేస్తున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అధికారులు పీజీఆర్ఎస్ పోర్టల్ను నిరంతరం పరిశీలిస్తూ పెండింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ 1100 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా అందుతున్న ఫిర్యాదులను అత్యంత బాధ్యతతో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రతి అర్జీదారునితో నేరుగా మాట్లాడిన తరువాతే ఎండార్స్మెంట్ ఇవ్వాలని, మాట్లాడిన తేదీ, సమయం వివరాలను తప్పనిసరిగా నివేదికల్లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజల్లో 1100 సేవలపై మరింత అవగాహన కల్పించాలని సూచించారు.వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు సమస్యలను జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్, మరియు , ఆర్డీఓ డిప్యూటీ కలెక్టర్లకు అందజేశారు.

# అంతరపంటల విధానాన్ని ప్రోత్సహించండి

- సబ్సిడీతో వేరుశనగ విత్తనం, యూరియాను రైతులు పొందండి..
- మండల వ్యవసాయ అధికారిని విజయభారతి



**సోమందేపల్లి టౌన్ జూన్ 22 మనం న్యూస్:** మండల పరిధిలోని చల్లపల్లి ,జూలుకుంట గ్రామాల్లో రైతన్న మీకోసం కార్యక్రమంమండల వ్యవసాయ అధికారిణి విజయభారతి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ సబ్సిడీపై మేలైన విత్తనాలు,ప్రకృతి వ్యవసాయం,90%సబ్సిడీ పై బిందు సేద్యం ,పంటల సాగులో ఏ 1డిజిటల్ సేవలు సాటిలైట్ , వ్యవసాయ యాంత్రీకరణ గురించి రైతులకు వివరించడం జరిగింది. అలాగే వేరుశెనగ విత్తన పంపిణీ ,మరియు యూరియా పంపిణీ రైతులకు చేయడం జరిగింది.రైతన్న మీకోసం ఈనెల 22 నుండి 27 వరకు జరుగుతుందన్నారు. రైతు ఆధార్ కార్డు ఆధారంగా పిఎసి ఎస్ లేదా ఇతర రిటైల్ దుకాణాల ద్వారా ఎరువులను పొంద వచ్చని,ఆధార్ కార్డుకు అనుసంధానమైన మొబైల్ నంబర్కు వచ్చే ఓటిపి ద్వారా ఈ కొనుగోలు ధ్రువీకరించవచ్చు అన్నారు. ఎరువుల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా రశీదు పొందండి. అవసరానికి మించి ఎరువుల కొనుగోలు చేయవద్దు.పచ్చిరొట్ట, సేంద్రియ ఎరువులను వాడటం ద్వారా రసాయన ఎరువుల వాడకాన్ని కొంత మేర తగ్గించండి అన్నారు

# చేనేత సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ ముట్టడి

**ధర్మవరం అర్బన్, జూన్ 22, మనం న్యూస్** చేనేత కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పుట్టపర్తిలో భారీ నిరసన ర్యాలీ, ధర్నా నిర్వహించారు. గణేష్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లిన చేనేత కార్మికులు కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా నాయకులు వెంకటనారాయణ, జేవీ రమణ, గిర్రాజు రవి, తుంపర్తి పరమేష్ తదితరులు మాట్లాడుతూ ఎన్నికల హామీల మేరకు 'నేతన్న నేస్తం' కింద రూ.25 వేల ఆర్థిక సాయం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చేనేత పరిశ్రమపై జీఎస్టీ రద్దు, 50 ఏళ్లు నిండిన కార్మికులకు పెన్షన్, సహకార సంఘాలకు బకాయి ఉన్న రూ.203 కోట్ల చెల్లింపు, ధర్మవరంలో ఆర్డీడీ కార్యాలయం ఏర్పాటు వంటి డిమాండ్లను ప్రస్తావించారు.అలాగే చేనేత రంగానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు, ఉచిత విద్యుత్, రుణమాఫీ, ముడిసరుకులపై సబ్సిడీ, హ్యాండ్లూమ్ రిజర్వేషన్ చట్టం అమలు, కనీస వేతనాల చట్టం, చేనేతలకు గృహాలు, పెన్షన్లు కల్పించాలని కోరారు.అనంతరం 22 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్కు సమర్పించారు.



కార్యక్రమంలో చేనేత నాయకులు, మహిళలు, సహకార సంఘాల ప్రతినిధులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వికలాంగుల పట్ల మానవతా దృక్పథంతో స్పందించినకలెక్టర్



**తిరుపతి, జూన్ 22మనం న్యూస్:** మానవతా దృక్పథంతో స్పందించిన జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, కరకంబాడి సమీపంలోని బీసీ కాలనీలో నివసిస్తున్న నిరుపేద కుటుంబానికి చెందిన నలుగురు వికలాంగులకు రూ.2 లక్షల తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సోమవారం తిరుపతి కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో గంప పరశురామయ్య గంప మునెమ్మ దంపతుల సంతానం అయిన గంప చంద్రశేఖర్, గంప రాజేశ్వరి, గంప రవి మరియు అదే కుటుంబానికి చెందిన దేరంగుల వీరభద్ర అను వారు తమ దయనీయ పరిస్థితిని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కుటుంబంలో నలుగురు సభ్యులు మానసిక, శారీరక వికలాంగులుగా బాధపడుతున్న నేపథ్యంలో ఆర్థిక సహాయం కావాలని కోరారు. వారి పరిస్థితిని తెలుసుకున్న జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి, తక్షణ సాయంగా రూ.2 లక్షల చెక్కును అందజేశారు. ఈ ఆర్థిక సహాయం గంప చంద్రశేఖర్, గంప రాజేశ్వరి, గంప రవి, దేరంగుల వీరభద్ర అనే నలుగురు వికలాంగులకు అందించారు.ఈ పరిస్థితిని గుర్తించిన జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మానవతా దృక్పథంతో వెంటనే సహాయం అందించడం పట్ల కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నలుగురు వికలాంగులకు పెన్షన్, సదరం సర్టిఫికెట్ లు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు , శ్రీ జనతా సేవా మిత్ర హెల్పింగ్ హాండ్స్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# కుల రాజకీయాలను ప్రజలు తిరస్కరిస్తారు

- చిలకం మధుసూదన్ రెడ్డి

**ధర్మవరం అర్బన్ జూన్ 21 మనం న్యూస్:** వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆ పార్టీ నాయకులు కుల రాజకీయాలను ప్రోత్సహించడం దురదృష్టకరమని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి విమర్శించారు. జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జనసేన అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కులాలను కలిపే నాయకుడని, ఆయనను ఒకే కులానికి పరిమితం చేయాలనే ప్రయత్నాలను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరని అన్నారు. పవన్ కళ్యాణ్ అన్ని వర్గాల ప్రజల నాయకుడని స్పష్టం చేశారు.

గతంలో కుల రాజకీయాలకు పాల్పడిన కారణంగానే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం 11 అసెంబ్లీ స్థానాలకు పరిమితమైందని, అయినప్పటికీ ఆ పార్టీ నాయకత్వానికి ఇప్పటికీ బుద్ధి రాలేదని విమర్శించారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.

# విభిన్న ప్రతిభావంతుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు

- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**అనంతపురం, కలెక్టరేట్ జూన్ 22: మనం న్యూస్** అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించగా, ఇందులో భాగంగా తమ సమస్యలు తెలిపేందుకు రెవెన్యూ భవన్ వద్దకు పలువురు విభిన్న ప్రతిభావంతులు రాగా తెలుసుకుని, వారి వద్దకే జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ వెళ్లి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు తమకు బ్యాంకు రుణాలు, భూమి, తదితర



సమస్యలను తెలియజేయగా వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. మొదటి అంతస్తులో ఉన్న రెవెన్యూ భవన్ నుండి వారి వద్దకే స్వయంగా వెళ్లి జిల్లా కలెక్టర్ అర్జీలను స్వీకరించడం పట్ల దివ్యాంగులు కృతజ్ఞతలు తెలిపారు.

# సుడిగాలి పర్యటనలో భాగంగా పలు కుటుంబాలను పరామర్శ

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ప్పేస్వామి

**మడకశిర,జూన్ 22,మనంన్యూస్:** మడకశిర మండలంలో సోమవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సిఇసి సభ్యుడు డాక్టర్ ఎం.తిప్పేస్వామి సుడిగాలి పర్యటన చపట్టారు.మడకశిర మండలం వైసిపి జెసిఎస్ మాజీ కన్వీనర్ నాగేంద్ర చిన్నాయన నాగిరెడ్డి ఇటీవలే మృతి చెందగా వారి నివాసం చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్.అనంతపురం నకు చెందిన వైసిపి నాయకుడు వెంకటేష్ తల్లీ మృతి చెందగా సమాచారం తెలుసుకున్న అయన మృతురాలి నివాసం చేరుకుని మృత దేహానికి పూలమాల వేసి



నివాళులు అర్పించారు.కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. రేకులకుంట గ్రామ తలారి నరసప్ప మనవడు మృతి చెందగా అయన మృతుని స్వగ్రామం చేరుకుని మృత దేహంనకు పూల మాలవేసి నివాళులు అర్పించారు,కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# నూతన సీఐ బాల సురేశ్ బాబును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసిన జనసేన నాయకులు


**కుకునూరు, జూన్ 22 ( మనం న్యూస్ )** కుక్కునూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ గా ( సీఐ )నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బాల సురేశ్ బాబును సోమవారం కుక్కునూరు మండల జనసేన పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు



తెలియజేశారు. నూతన సీఐ బాల సురేశ్ బాబు తన విధి నిర్వహణలో మరిన్ని విజయాలు సాధించాలని జనసేన నాయకులు ఆకాంక్షించారు. ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ, మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు విశిష్ట సేవలు అందించాలని వారు కోరారు. ఈ సమావేశంలో పాల్గొన్న నాయకులు జనసేన పార్టీ ఉపాధ్యక్షులు మంత్రి గోపాల కృష్ణ, మోదుంపురపు వెంకన్న బాబు,జనసేన సీనియర్ నాయకులు చల్ల కోటి నాయుడు కుకునూర్ టౌన్ ప్రెసిడెంట్ కుకునూర్ సీతారామయ్య, జనసేన సోషల్ మీడియా కన్వీనర్ గరగా జగదీశ్, కివ్వాక గ్రామ కన్వీనర్ రాయి కృష్ణార్జునరావు , తొండిపాక గ్రామ కన్వీనర్ ఆవుల శ్రీను,ప్రచార కార్యదర్శి లక్ష్మణ్ స్వామి, హై స్కూల్ చైర్మన్ గంధం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ను దెబ్బతీసేందుకు కుట్రలా?





తెలంగాణ రాజకీయ క్షేత్రం ప్రస్తుతం తీవ్రమైన విమర్శలు, ప్రతివిమర్శలతో అట్టుడుకుతోంది. శాసనసభ ఎన్నికల తర్వాత కాస్త శాంతించినట్లు కనిపించిన రాజకీయ వాతావరణం, ఆ తదుపరి పరిణామాలు మరియు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఒక్కసారిగా వేడెక్కింది. సిద్ధాంతాల పరంగా ఉత్తర-దక్షిణ ధ్రువాలుగా చెప్పుకునే భారత్ రాష్ట్ర సమితి, భారతీయ జనతా కూటమి ప్రస్తుతం అధికార కాంగ్రెస్ పక్షాన్ని లక్ష్యంగా చేసుకుని ఏకకాలంలో దాడులు తీవ్రం చేశాయి. ప్రభుత్వ విధివిధానాలు, సాయం పంపిణీ వివాదం, మంత్రులపై అవినీతి ఆరోపణల వంటి ప్రతి అంశంలోనూ ఈ రెండు పార్టీల గళం ఒకేలా ధ్వనిస్తుండటం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీసింది. 'శత్రువుకు శత్రువు మిత్రుడు' అనే రాజకీయ సూత్రం ఆధారంగానే అటు కేంద్రం, ఇటు రాష్ట్ర వ్యూహాలు నడుస్తున్నాయా? ఈ ముకుమ్మడి దాడి వెనుక నిజంగానే ఒక లోపాయికారీ ఒప్పందం దాగి ఉందా? అనే కోణంలో సమగ్ర విశ్లేషణ అవసరం.

ప్రస్తుత పరిణామాలను గమనిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు అటు భారత్ రాష్ట్ర సమితి నాయకత్వం, ఇటు భారతీయ జనతా కూటమి నేతలు ఏ ఒక్క అవకాశాన్ని వదలడం లేదు. అయితే ఈ రెండు పక్షాల దూకుడును అధికార కాంగ్రెస్ పక్షం చాలా చాకచక్యంగా తన వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తోంది. ప్రతిపక్షాలు రెండు ఒకటేనంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్తోంది. దేశ రాజధానిలో కేసుల విచారణల వేగం తగ్గడం, కొన్ని కీలక పరిణామాల నేపథ్యంలో ఈ రెండు పక్షాల మధ్య తెరవెనుక ఒక అవగాహన కుదిరిందని, అందుకే రాష్ట్రంలో కాంగ్రెస్‌ను ఒంటరిని చేసేందుకు ఉమ్మడి వ్యూహంతో ముందుకు సాగుతున్నారని అధికార పక్షం గట్టిగా వాదిస్తోంది. ఈ ఆరోపణలను ప్రతిపక్షాలు ఎంతగా ఖండిస్తున్నప్పటికీ, వారి పోరాట శైలి మాత్రం ప్రజల్లో అనుమానాలకు తావిచ్చేలా ఉందనేది కొందరి అభిప్రాయం.

కానీ, ఈ వ్యవహారాన్ని రాజకీయ వ్యూహాల కోణం నుండి చూస్తే ఇందులో లోపాయికారీ పొత్తు కంటే కూడా సమయానుకూల అవసరం ఎక్కువగా కనిపిస్తోంది. ప్రస్తుతానికి తెలంగాణలో కాంగ్రెస్ పక్షం బలంగా ఉంది. కాంగ్రెస్ గనుక ఇదే ఉత్సాహాన్ని మరికొన్నేళ్లు కొనసాగిస్తే, అది ఇటు భారత్ రాష్ట్ర సమితి ఉనికికి, అటు భారతీయ జనతా కూటమి కలకి ఒకేసారి గండం తప్పని పరిస్థితులు పుష్కలంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా, క్షేత్రస్థాయిలో ప్రాంతీయ పక్షం బలహీనపడితే ఆ ఖాళీని తామే భర్తీ చేయాలని జాతీయ పక్షం ఆశిస్తుండగా, తమ ప్రాంతీయ అస్తిత్వాన్ని కాపాడుకుని మళ్లీ పుంజుకోవాలని భారత్ రాష్ట్ర సమితి భావిస్తోంది. ఇలాంటి తరుణంలో బీఆర్ఎస్, బీజేపీలకు కాంగ్రెస్ పక్షమే ప్రధాన శత్రువు కావడం వల్ల, వారి దాడుల లక్ష్యం ఒక్కటే అయింది. దీనివల్ల పైకి వీరిద్దరూ కలిసి కట్టుగా నడుస్తున్నట్లు భ్రమ కలుగుతోంది. వాస్తవం మాత్రం ఆయా పార్టీల నేతలకే వదిలేయాలి.

రైతాంగ సమస్యల విషయానికి వస్తే, గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో అధికార పక్షం విఫలమైందని ప్రతిపక్షాలు ముక్తకంఠంతో నినదిస్తున్నాయి. పంటలకు అందించే సాయం, పెట్టుబడి మద్దతు పంపిణీలో జరుగుతున్న ఆలస్యాన్ని అటు ప్రాంతీయ పక్షం, ఇటు జాతీయ పక్షం తమకు అనుకూలంగా మార్చుకోవాలని చూస్తున్నాయి. ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపడం ప్రతిపక్షాల బాధ్యత అయినప్పటికీ, ఈ రెండు పార్టీలు ఒకే రకమైన విమర్శనాస్త్రాలను సంధించడం వెనుక తెరవెనుక వ్యూహకర్తల హస్తం ఉందనే అనుమానాలు రాజకీయ వర్గాల్లో బలపడుతున్నాయి. నిధుల కొరతను సాకుగా చూపిస్తూ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా దారి మళ్లిస్తోందని ఇరు పక్షాలు ఆరోపిస్తున్నాయి.

తెలంగాణ సమాజం రాజకీయంగా అత్యంత చైతన్యవంతమైనది. గతంలో జరిగిన అనేక ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పులు ఈ విషయాన్ని నిరూపించారు. ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ప్రజలు వింటున్నారు కానీ, ఒకవేళ ఈ రెండు ప్రతిపక్షాల మధ్య అంతర్గత అవగాహన..లోపాయికారి ఒప్పందం నిజమే అని ప్రజలు నమ్మితే అది రెండు పక్షాలకూ రాజకీయంగా భారీ నష్టాన్ని చేకూరుస్తుంది. ఎందుకంటే తెలంగాణ సెంటిమెంట్‌తో పుట్టిన ప్రాంతీయ పక్షం, జాతీయ వాదంతో నడిచే పక్షంతో పూర్తిగా చేతులు కలిపిందని భావిస్తే కార్యకర్తల్లో గందరగోళం మొదలవుతుంది. అందువల్లనే, ఈ రెండు పక్షాలు కాంగ్రెస్‌పై ఎంత ముకుమ్మడి దాడి చేస్తున్నప్పటికీ, తమ మధ్య ఎలాంటి సంబంధం లేదని చెప్పుకోవడానికి చాలా కష్టపడుతున్నాయి.

మరోవైపు, అధికార పక్షం కూడా ఈ దాడులను ఎదుర్కొనేందుకు తనదైన శైలిలో వ్యూహ ప్రతివ్యూహాలను సిద్ధం చేస్తోంది. ప్రతిపక్షాల ఆరోపణలలో నిజం లేదని, గత పదేళ్ల పాలనలో జరిగిన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికే ఈ రకమైన కుయుక్తులు పన్నుతున్నారని మంత్రులు తిప్పికొడుతున్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయం పారదర్శకంగా ఉందని, త్వరలోనే అన్ని హామీలను పూర్తి స్థాయిలో అమలు చేస్తామని ప్రజలకు భరోసా కల్పిస్తున్నారు. అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తమకు అనుకూలంగా మార్చుకోవడానికి ప్రతిపక్షాలు చేస్తున్న ప్రయత్నాలు రాష్ట్రంలో ముందస్తు ఎన్నికల వాతావరణాన్ని తలపిస్తున్నాయి.

అంతిమంగా, ప్రస్తుతం రాష్ట్రంలో నడుస్తున్న పరిణామాలు కేవలం రాబోయే స్థానిక ఎన్నికల హడావిడి మాత్రమే కాదు, భవిష్యత్తులో అసలైన ప్రత్యామ్నాయం ఎవరు అని నిరూపించుకునే పెద్ద యుద్ధం. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ఈ తెరవెనుక రాజకీయాల అసలు రంగును బయటపెట్టనున్నాయి. ఆ ఎన్నికల్లో ఈ రెండు పక్షాలు క్షేత్రస్థాయిలో ఒకరికొకరు వ్యతిరేకంగా ఎంత వరకు పోరాడతాయి, లేదా లోపాయకారీగా ఓట్ల బదిలీకి పాల్పడతాయా అనే దాన్నిబట్టే ఈ అనుమానాలకు పూర్తి సమాధానం లభిస్తుంది. అప్పటివరకు అధికారపక్షం ఈ సహజ శత్రువుల వైఖరిని ప్రజల్లో ఎండగడుతూ తన పట్టును నిలుపుకునే ప్రయత్నం చేస్తుంది. బీజేపి నైజాన్ని ఎండకట్టే ప్రయత్నాలు కూడా చేస్తుంది. ప్రతిపక్షాలు తమ ముకుమ్మడి దాడితో ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలో పడేసే వ్యూహాన్ని కొనసాగిస్తాయి. ఏది నిజం, ఏది రాజకీయం అనే విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారు కాబట్టి, రాబోయే రోజుల్లో వచ్చే తీర్పే ఈ రాజకీయ గందరగోళానికి తెరదించుతుంది.

**- వెంక గారి భూమయ్య**
9848559863

## పచ్చడి కలిపే చేతులు

ఇంటింటికో కథ ఉన్నట్టు
మా ఇంటి మా పచ్చడి కథ
ఏ ఇంటి రుచి... ఆ ఇంటిదే
ఆకు పచ్చని
కొత్త మామిడి కాయలు
ఇళ్లకు తరలి వచ్చిన
మామిడి చెట్లు
ఆకుపచ్చని కాంతి
వాళ్ళ వేళ్ళ కొసలని తాకి పచ్చని
కొమ్మల్లా

మెరిసి పోతున్నవి
ఇంటికి కొత్త ఋతువు
వచ్చినట్టు
పచ్చడి కాలానికి తలుపులు
తెరుస్తున్నవి
ఎర్రని మిరపకాయల
ఘాటు ముక్కుపుటాలకు తాకి
తుమ్ములు.. కళ్ళలో నీళ్ళు
ఎల్లిపాయలు పొట్టు తీయలేక
చేతివేళ్ళకు కాయలు
దొడ్డుప్పు వెన్నెల్లో
చమక్కు మంటుంది
అమ్మ మెంతులను
వస్త్ర కాయితం పడుతుంది
కమ్మని వాసనలు
ఇల్లంతా కలియ తిరుగుతుంది
ఏ ఇంట్లో చూసినా
పచ్చడి సందడి
నాయన కత్తిపీటపై
ముక్కలు చేస్తే కొలత తప్పని సైజు
కళ్ళన్నీ కాయలు చేసి
ముక్కలను చూసేది

బట్ట తీసుకుని అక్కలు
జీడితీసి శుభ్రంగా తుడవటం
మామిడి ముక్కని కొరికితే
జివ్వుమనే పులుపు
ఆరబెట్టిన ముక్కల రాశులు
ఒక రకమా!
అమ్మ పెట్టె పచ్చడి
అక్కలు ఇష్టంగా పెట్టుకునే
నువ్వుల మామిడి
అల్లం మామిడి
ఆవ మామిడి
అన్ని రకాల జాడీలు
నిలువు జాడీలు
బొద్దుగా ముద్దు జాడీలు
చిన్న జాడీలు
ఎన్ని వన్నెచిన్నెల జాడీలో
మనుషుల్లో రకాలుగా
జాడీలు చేసేవాడి

చేతివేలి కొసలనుండి
జారిన సాల బంజికలు
తరాల కథల్ని
పూసగుచ్చి చెబుతవి
కొలువుదీరిన బొమ్మల్లా
జాడీల వరుస
నీళ్ల తడి తాకకుండా
లక్ష్మణ రేఖలు
నిషేధాలు
పచ్చడి నిల్వకోసం కట్టుబాట్లు
ఎన్ని కొలతలు
ఎన్ని పాళ్ళు చెప్పినా
అమ్మ పెట్టే పచ్చడి
అపురూపం
పచ్చడి కలిపే అమ్మచేతులు
అరచేతులు గోరంటాకు
పెట్టుకున్నట్టు
ఎండు మిరపకాయల్లా చేతి
వేళ్ళు నిగ నిగ లాడేవి
మా అందరికి
కలపాలనే కోరిక ఉన్నా
పిల్లలు కారాన్నీ
పులుముకుంటారోననే
అమ్మ మమకారం!
తాకనిచ్చేది కాదు
ఉప్పు,కారం,మెంతి పొడి
పల్లి నూనె
ముక్కలుకు కలుపుతుంటే
ఎప్పుడెప్పుడు
అమ్మ పెట్టె ఎర్రని కారంముద్దల
కోసం
నీళ్లూరుడు
అరచేతిలో పెట్టుకుని తింటుంటే
ఆ రుచికి
దేవతలే దిగివస్తారు

**- డా.సుంకర రమేశ్**
9492180764

## శరణార్థులకు సంఘీభావం తెలుపలేమా!



యుద్ధాలు, సంక్షోభాలు, హింసలు, పీడించడం, వాతావరణ ప్రతికూల మార్పులు, జాతి వివక్షలు, మత విద్వేషాలు, జాతీయత, కొన్ని సామాజిక లేదా రాజకీయసంఘాల్లో సభ్యత్వాల కారణంగా ప్రాణ భయంతో మరో దేశానికి వెళ్లి శరణు కోరి ప్రాణాలు కాపాడుకునే ప్రత్యేక వ్యక్తులు లేదా సమూహాలను శరణార్థులుగా నిర్వచిస్తాం. నేరుగా మరో దేశంలో శరణార్థులుగా చేరే వారు, ఆశ్రమం పొందే వారు, అంతర్గతంగా స్థానభ్రంశం పొందిన వారు, ఏ దేశానికి చెందని వారు, అనేక ఏళ్ల తర్వాత తిరిగి తమ దేశానికి చేరి వారందరూ శరణార్థుల జాబితాలో వస్తారు.

శరణార్థులు, వారి పిల్లలు పడుతున్న అమానవీయ వేదనలను గుర్తించి ఐరాస తీసుకున్న నిర్ణయం ప్రకారం ప్రతి ఏట 20 జూన్ రోజున ప్రపంచ శరణార్థి దినోత్సవాన్ని పాటించడం జరుగుతోంది. మరో దేశం నుంచి ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వచ్చిన శరణార్థులు కూడా సాధారణ మానవులే అని, వారికి కూడా కనీస మానవ హక్కులు వర్తిస్తాయని, వారితో ధైర్యాన్ని నింపడం, వారి పిల్లలకు విద్య వసతులు విస్తరించాలని, ఆకలి చావుల కోరల్లో చిక్కకుండా చూసుకోవాలని ప్రపంచ దేశాలకు అవగాహన పరచడానికి ఈ వేదికలు ఉపయోగపడుతున్నాయి. 2026 ప్రపంచ శరణార్థి దినోత్సవం ఇతివృత్తంగా అందరు సురక్షితంగా ఉండే వరకు శరణార్థులకు సంఘీభావం ప్రకటిద్దాం అనే అంశాన్ని నిర్ణయించారు. శరణార్థులను కూడా సాధారణ పౌరులుగా చూడాలని, శత్రువులుగా భావించ వద్దని ఐరాస సూచిస్తున్నది. శరణార్థుల పట్ల సహానుభూతి చూపడం, కనీస మానవ హక్కులను కల్పించడం, వారికి సంఘీభావంగా ప్రచారాలు నిర్వహించడం, వారి జీవిత కథలను వినడం, వారి అనుభవాలను అర్థం చేసుకోవడం, వారి పట్ల రాజకీయ ఏకీకరణ జరగడం, వారి అభ్యున్నతికి నిధులు కేటాయించడం, వారి మనోభావాలను అర్థం చేసుకోవడం లాంటివి కొనసాగాలి.


భారత్లోకి శ్రీలంక, మియాన్మార్, అఫ్ఘానిస్థాన్, టిబెట్, బంగ్లాదేశ్ లాంటి ఇరుగు పొరుగు దేశాల నుంచి వేల మంది శరణార్థులు భారత భూభాగంలోకి శరణార్థులుగా చేరడం కొనసాగుతున్నది. శ్రీలంకన్ తమిళులు, రోహింగ్యాలు, టిబెటన్లు, చక్మా-హజోంగ్లు, జూయిష్ వర్గాలు అధిక సంఖ్యలో భారత్‌కు రావడం, శరణార్థులుగా జీవితాలను కొనసాగించుకోవడం జరుగుతూ కొన్ని సార్లు మన దేశంలో శాంతి భద్రతల సమస్యలకు కూడా కారణం అవుతున్నారని కూడా భావించడంతో జరుగుతోంది. భారత్‌లో చేరిన శరణార్థులు అధిక శాతం పట్టణ ప్రాంతాల్లో స్థిరపడి అసంఘటిత పనుల్లో నిమగ్నం అవుతున్నారు. శరణార్థి కుటుంబాలకు చెందిన పిల్లలు 7 శాతం మాత్రమే విద్య కొనసాగిస్తున్నారని, 87 శాతం శరణార్థులు అల్పాదాయ, మధ్యాదాయ దేశాల్లోనే జీవిస్తున్నారని తెలుసుకోవాలి.

ప్రపంచ శరణార్థి దినోత్సవ వేదికగా నిజమైన శరణార్థులను గుర్తించి వారికి కనీస వసతులను కల్పించడం నిరంతరం జరగాలి. నిస్సహాయ స్థితుల్లో శరణార్థులుగా చేరిన వారి కుటుంబాలకు కనీస అవసరాలు తీర్చడం, సహానుభూతితో వారికి గొడుగు పట్టడం, వారి పిల్లలకు చదువుకునే అవకాశాలు కల్పించడం, మానవీయ కోణంలో అక్కున చేర్చుకోవడం, వారికి వైద్య ఆరోగ్య వసతులు కల్పించం, వారిని మానవులుగా గౌరవించడం, సమానత్వ భావనలను ఆచరించడం, కనీస సహ కారాలను అందించడం కొనసాగాలి. ఊహించని సంద ర్భాల్లో పరాయి దేశంలోకి చేరిన శరణార్థులకు మానవ హక్కుల గొడుగు పడదాం, వారి శ్రేయస్సుకు పాటు పడదాం.

**- డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

## సేవలో సమర్థత పాలనలో నైతికత

ప్రపంచవ్యాప్తంగా ప్రజల మేలు కోసం ప్రభుత్వ యంత్రాంగాలు చేసే సేవలకు గౌరవం చెల్లించేందుకు, సేవా విధులలో నిబద్ధతతో పనిచేసే అధికారులను సత్కరిం చేందుకు ఐక్య రాజ్య సమితి ప్రతీ సంవత్సరం జూన్ 23వ తేదీని ప్రజా సేవా దినోత్సవంగా జరుపుకుంటుంది. ప్రభుత్వ రంగంలో నైతికత, సమర్థత, పారదర్శకత, ప్రజలపట్ల బాధ్యత అనే విలువలను ఈ దినోత్సవం నొక్కిచెబుతోంది.




ఈ దినోత్సవానికి చరిత్రాత్మక ప్రాముఖ్యత ఉంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ 1978లో ఆమోదించిన 'కార్మిక సంబంధాలపై పబ్లిక్ సర్వీస్ కూటమి -నం.151'ను గుర్తుగా, 2002లో ఐక్య రాజ్య సమితి సాధారణ సభ A/RES/57/277 తీర్మానం ద్వారా జూన్ 23ను అధికారికంగా ప్రజా సేవా దినంగా గుర్తించింది. 2003 నుండి ఈ దినోత్సవం అంతర్జాతీయంగా జరుపు కుంటున్నారు.

ఈ దినోత్సవం నాలుగు ముఖ్యమైన లక్ష్యాల చుట్టూ నడుస్తుంది.ప్రజా సేవకుల కృషిని గౌరవించడం, యువతను సేవామార్గం లోకి ప్రేరేపించడం, ప్రజా పరిపాలనను మెరుగు పరచడం, ఉత్తమ పాలనా పద్ధతులను పంచుకోవడం. ప్రజా పరిపాలనలో కొత్త ఆవిష్కరణలకు మార్గం వేసే ఈ దినోత్సవం ద్వారా ప్రభుత్వ సేవల ప్రాముఖ్యతను ప్రపంచం అంతటా గుర్తించి, వాటిని బలోపేతం చేయడమే లక్ష్యం.

ప్రతి సంవత్సరం ఐక్య రాజ్య సమితి ప్రభుత్వం ద్వారా అమలవుతున్న వినూత్న సేవల కోసం ప్రజా సేవా అవార్డులు ప్రదానం చేస్తుంది. పాలనలో ప్రజల భాగస్వామ్యం, డిజిటల్ సేవల వినియోగం, లింగ సమానత్వం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో విశిష్టత చూపిన ప్రభుత్వ సంస్థలకు ఈ అవార్డులు లభిస్తాయి. అవార్డులు కేవలం గౌరవం మాత్రమే కాదు. ఇతర దేశాలకు ఆదర్శంగా నిలిచే విధానాలకు గుర్తింపు కూడా.

భారతదేశంలో ప్రజా సేవలకు అనేక అభినవ నమూనాలు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనది పంజాబ్ రాష్ట్రం మోహాలీ జిల్లాలో ప్రారంభించిన 'సేవా కేంద్రాలు'. ఈ కేంద్రాల్లో పౌరులకు అవసరమైన సేవలు - పుట్టిన సర్టిఫికెట్, ఆదాయ ధృవీకరణ, విద్యుత్ బిల్లులు, ప్రభుత్వ పథకాల దరఖాస్తు మొదలైనవి ఒకే చోట, సమర్థవంతంగా అందు తున్నాయి. ఈ మోడల్‌కు ఐక్య రాజ్య సమితి 2015లో ప్రజా సేవా అవార్డు ప్రదానం చేయడం గర్వకారణం. ఇదే విధంగా ఆంధ్రప్రదేశ్ వాలంటీర్ వ్యవస్థ, కర్ణాటక భూమి పత్రాల డిజిటలైజేషన్, కేరళలో అత్యవసర సేవల నిర్వహణ వంటి కార్యక్రమాలు ప్రజా సేవలో నూతన దిశలు చూపిస్తున్నాయి.

ప్రజా సేవ అనేది కేవలం ప్రభుత్వ ఉద్యోగి విధిని నిర్వహించడమే కాదు. అది ప్రజల పట్ల ఉన్న బాధ్యతను, నమ్మకాన్ని నిలబెట్టే ధర్మం. ప్రభుత్వ ఉద్యోగి నైతికతతో, సమర్థతతో పని చేస్తేనే పాలనా వ్యవస్థ పటిష్ఠంగా నిలబడుతుంది. అందుకే ఈ దినోత్సవం ప్రతి ప్రభుత్వ సేవకునికి గుర్తు చేస్తోంది ఈ రోజు సందర్భంగా, ప్రభుత్వాలు తమ ప్రజా సేవ విధానాలను సమీక్షించుకోవాలి. పాలకుల నిబద్ధత, ప్రజల పట్ల జవాబుదారీతనం, సేవల సరళత వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. యువతలో ప్రజా సేవా స్ఫూర్తిని పెంపొందించే కార్యక్రమాలను ప్రోత్సహించాలి.

జూన్ 23 ఐక్య రాజ్య సమితి ప్రజా సేవా దినోత్సవం ప్రజల శ్రేయస్సు కోసం ప్రభుత్వ వ్యవస్థలు, అధికారులు కలసికట్టుగా పనిచేయాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది. సేవే లక్ష్యంగా, నైతికతే ఆధారంగా పనిచేసే వారు ఈ ప్రపంచాన్ని మెరుగైన స్థలంగా మార్చగలరు. అవే నిజమైన ప్రజా సేవకులు.

**జూన్ 23...ఐక్య రాజ్య సమితి ప్రజా సేవా దినోత్సవం**

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494


## ఒక బేలతనం!

అతను
భారం మోసినంతకాలం
ఎన్నడూ పెద్దగా అలసిపోలేదు!
తనని
ఇతర్లు మోసే కాలం దాపురించినప్పుడే
నిత్యం దేనికోసమో ఎదురుచూపు!
ఎంతగా దాచుకుందామనుకున్నా
కళ్ళల్లో లీలగా
ఒక భయం తండ్లాట!
రసం పిండుకున్నాక
అది బంగినపల్లి మామిడిపండైనా
టెంక విసిరేయాల్సిందే!
ఈ సత్యం తెలిస్తే .. జీవిత చరమాంకంలో
పెద్ద దిగులు ఉండదు!
ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా
పెన్షన్ ఖాతా ఖాళీ అవుతూనే ఉంది
దృష్టి ఆనక బాధ తెలియదంతే!
బ్యాలెన్స్ ఎంతుందంటే
మొన్ననే చెప్పానుగా అన్నా
బుర్ర గోక్కోవడానికి చేయి సహకరించదు!
ఎవరికీ ఏమీ వినపడరాదని
లోలోన చేసుకున్న సణుగుడు మాత్రం
అందరికీ వినిపిస్తుంది!
అతని అనుభవం
నాకేం నేర్పిందంటే పారిజాతానికైనా
నేల రాలేంతవరకే విలువని!!

**- కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
94402 33261

# ప్రతీకార దాడులతో ప్రయోజనమేమి?

2022 లో ప్రారభమైన రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ఎడతెగక సాగుతోంది. రెండు దేశాలు ప్రతీ కార దాడులతో రెచ్చిపోతున్నాయి. ఇటీవల రష్యా రాజధాని మాస్కోపై ఉక్రెయిన్ కని వినని రీతిలో దాడులు చేసింది.రష్యాలోని ఒక రిఫయినరిలో తీవ్ర దాడి జరిగింది. ఇది ఆగ్నేయ మాస్కోలో ఉంది. ఇది అత్యంత పెద్ద రిఫయినరి. దీనిపైనే ఉక్రెయిన్ కన్నేసింది. దీన్ని దెబ్బ తీస్తే రష్యా ఆర్థిక మూలాలు దెబ్బ తింటాయానే ఉద్దేశంతో కపోట్నా జిల్లాలో వున్న రిఫైనరిపైనే మూడు సార్లు దాడి చేసింది. ఈ సారి జరిగిన దాడిలో ఆ రిఫైనరీలో మంటలు ఉవ్వెతున్న ఎగసి పడ్డాయి. ఆ దాడికి ఆకాశమంతా దట్ట మైన పొగలతో నిండిపోయింది. ఈ దాడితో రష్యా ఆగ్రహం ప్రకటించింది. మేము అనుకున్న విధంగానే రష్యాను దెబ్బ తీశామని ఉక్రెయిన్ కూడా ప్రకటన గుప్పించింది. ఉక్రెయిన్‌ను దెబ్బ తీస్తే, మాస్కోను కూడా తీవ్రంగా దెబ్బ తీస్తామని, ఈసారి మా దాడి అత్యంత భయకరంగా ఉంటుందని, ఇక యుద్ధం ముగిపు పలికే సమయం ఆసన్న మైందని, దౌత్యపరంగా రష్యానే యుద్ధంకు ముగింపు పలకాలని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని జెలెన్ స్కీ అభిమతంగా ఉంది. కానీ రష్యా అందుకు సుముఖంగా లేదు. ఇదిలా ఉంటే రష్యా ప్రకటన మరో విధంగా ఉంది. ఉక్రెయిన్‌కు చెందిన దాదాపు వెయ్యి డ్రోనులు, నాలుగు క్షిపణులు ధ్వంసం చేశామని రష్యా ప్రకటించింది. ఇలా ప్రతీకార దాడులతో రెండు కూడా సామరస్యంగా ఆలోచించకుండా దాడులతోనే రెచ్చి పోతున్నాయి. అయితే ఫ్రాన్స్ లో జరిగిన జి-7 దేశాల సదస్సులో ఐరొపాకు చెందిన సభ్య దేశాలు ఉక్రెయిన్‌కు మద్దతు ప్రకటించాయి. అమెరికా అధ్యక్షులు ట్రంప్ సమక్షంలో ఈ ప్రకటన చేయడం గమనార్హం. ట్రంప్ ఆలోచన వేరేగా ఉంది యుద్ధాన్ని నివారించడానికి శాంతిపై మనసు పెడతామని ట్రంప్ ప్రకటించారు.



ట్రంప్ ఆరాటం అంతా రెండు దేశాలు శాంతి బాట పట్టాలి అనే తలంపుగా ఉంది. వాస్తవానికి ఇలా ప్రతీ కార దాడులతో నష్టం మనకే అనే విషయం రెండు దేశాలు గ్రహించక పోవడం శోచనీయం.

ఇంకా ఎన్నాళ్ళు ఈ దాడులు. నివరించలేని అమెరికా, ఇరాన్ యుద్ధమే శాంతితో ముగిసింది. ఇప్పుడు దృష్టి అంతా రష్యా, ఉక్రెయిన్ పైనే ఉంది. దీని నివారణకు ట్రంప్ ఆలోచనలో ఉన్నారు. మంచిదే యుద్ధం నివారణ జరగాలని విశ్వం ఎదురు చూస్తోంది. ఇక్కడ వచ్చిన చిక్కు ఏమిటంటే రష్యా పెద్ద దేశమై పోయింది. దానికి చెప్పాలంటే కొంచెం కష్టమే. అందుకే చిన్న దేశమైనా ఉక్రెయిన్‌కు ఐరోపా దేశాలు అండగా నిలుస్తున్నాయి. అటువంటప్పుడు ఉక్రెయిన్‌కే ఈ ఐరోపా దేశాలు నచ్చజెప్పవచ్చు అనే మీమాంస ఎదురవుతోంది. చిన్న దేశమైనా ఉక్రెయిన్ దాడి చాలా భీతహంగా ఉంది. రాజీ చర్యలు ఉక్రెయిన్ నుంచే రావాలి అని రష్యా పట్టుదలగా ఉంది. ఇక్కడ యుద్ధం ఆగాలి అంటే ఉక్రెయిన్‌కే ఐ రోపా దేశాలు చెప్పాలి. ట్రంప్ కూడా ఉక్రెయిన్‌కే చెబితే యుద్ధం ఆగి పోయే అవకాశాలు ఉన్నాయి. ఒక వేళ ఉక్రెయిన్ రాజీకి ఇప్పుకుంటే దాని పునర్‌నిర్మాణానికి అంటే రష్యా దాడులతో నష్టపోయిన ప్రాంతాలను, కట్టాడాలను రష్యానే నిర్మాణం చేపట్టాలి. మరి ఉక్రెయిన్ దాడితో నష్టపోయిన రష్యాలోని కట్టడాలను ఎవరు పునర్ నిర్మిస్తారు అనే ప్రశ్న ఉదయిస్తుంది. అదే పెద్ద సమస్యగా ఉంది. దీనికి ఒక కార్యాచరణ రూపొందించాలి. ప్రతీ కార దాడులతో నష్టాన్ని నివారించాలి. రెండు దేశాలకు ఆమోద యోగ్య మైన చర్యలు చేపడితే యుద్ధం నివారణ ఆగి పోగలదు.

**- కనుమ ఎల్లారెడ్డి**
9391523027

## వేగ నియంత్రణ అందరి బాధ్యత




- ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్ కుమార్

**గాజువాక:-** అతివేగమే ప్రమాదాలకు దారి తీస్తుంది అని నగర ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్ కుమార్ అన్నారు.పాత గాజువాక కూడలిలో వేగ నియంత్రణ కోసం సిద్ధం చేసిన టైర్లతో కూడిన భారీకేడ్లను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కేవలం అవగాహన లోపం కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయని వీటి నియంత్రణ అనేది వాహన చోదకులపైనే ఉందన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసిపి భవ్య మాట్లాడుతూ సెల్ఫ్ రెస్పాన్సిబిలిటీ తో ట్రాఫిక్ సమస్య సాధ్యమవుతుందని ప్రజలందరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏ డి సి పి ప్రవీణ్ కుమార్ ఏసిపి భవ్య సిఐ హుస్సేన్ ఎస్సైలు రాధాకృష్ణ, శాంతారాం వాయిస్ ఆఫ్ గాజువాక సభ్యులు నాగేశ్వరరావు హేమంత్ మరియు ట్రాఫిక్ వారియర్స్ పాల్గొన్నరు.

## కారులో అకస్మాత్తుగా మంటలు



**పుట్టపర్తి, జూన్ 22 మనం న్యూస్:** పుట్టపర్తిలోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద సోమవారం ఉదయం నిలిపి ఉంచిన ఓ కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో కాసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దట్టమైన పొగలు ఎగసిపడటంతో అక్కడున్న రోగులు, వారి కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. అయితే అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపులోకి తీసుకురావడంతో పెను ప్రమాదం తప్పింది. కర్ణాటక రాష్ట్రంలోని ధార్వాడకు చెందిన ఓ కుటుంబం వైద్యం కోసం కారులో పుట్టపర్తికి వచ్చింది. ఆసుపత్రి బయట వాహనాన్ని నిలిపి ఉంచిన కొద్దిసేపటికే కారులో నుంచి పొగలు రావడంతో పాటు మంటలు వ్యాపించాయి. వెంటనే స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. పోలీసులు కూడా అక్కడికి చేరుకుని ఘటనపై వివరాలు సేకరించారు. రాత్రంతా ప్రయాణించి వచ్చిన ఈ వాహనంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఉండొచ్చని అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తత వల్ల పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

# డుంబ్రిగూడ రిసార్ట్ నిర్మాణంపై జాయింట్ కలెక్టర్ తనిఖీ, సమగ్ర విచారణకు ఆదేశం

ఏ ఎస్ ఆర్ జిల్లా పాడేరు, జూన్ : 22, డుంబ్రిగూడ మండలంలో గిరిజనుడి పేరుతో ఓ గిరిజనేతరుడు ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రికి రాత్రే శరవేగంగా భారీ రిసార్ట్ స్లాబ్ పనులు నిర్వహిస్తున్నట్లు, అలాగే బినామీ ఉచ్చులో చిక్కుకున్నారు అనే అమాయక గిరిజనుడు ప్రభుత్వ పథకాలను కోల్పోయే ప్రమాదంలో పడ్డాడనే కథనాలపై జిల్లా జాయింట్ కలెక్టర్ తీవ్రంగా స్పందించారు. పత్రిక, మీడియాలో వచ్చిన ఈ కథనాలను సుమోటోగా స్వీకరించిన జాయింట్ కలెక్టర్, తక్షణమే క్షేత్రస్థాయి పరిశీలన జరపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అలాగే జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, పంచాయతీరాజ్ ఐటీడీఏ అధికారుల బృందంతో కలసి జాయింట్ కలెక్టర్ సోమవారం సదరు రిసార్ట్ నిర్మాణ స్థలాన్ని సందర్శించి తనిఖీలు నిర్వహించారు.

**ఈ సందర్భంగా అధికారులు వెల్లడించిన వివరాలు,**

అనుమతుల ఉల్లంఘన, ఎటువంటి అధికారిక ముందస్తు అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా రాత్రి సమయాల్లో దొంగచాటుగా స్లాబ్ పనులు నిర్వహించినట్లు



ప్రాథమిక విచారణ జరిపించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

అందుకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగినట్లయితే చట్టపరమైన చర్యలు, షెడ్యూల్ ప్రాంతాలలో గిరిజన చట్టాలను (1/70 చట్టం) ఉల్లంఘించి, గిరిజనులను బినామీలుగా వాడుకుంటూ భూములు లాక్కోవాలని చూసే గిరిజనేతరులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.బాధిత గిరిజనుడికి రక్షణ, బినామీ ఉచ్చులో పడి ప్రభుత్వ పథకాలు కోల్పోయే ప్రమాదంలో ఉన్న అమాయక గిరిజనుడికి పూర్తి న్యాయం చేస్తామని, అతనిని లీగల్ కాంప్లికేషన్స్ నుండి కాపాడతామని తెలిపారు. ప్రస్తుతానికి సదరు రిసార్ట్ నిర్మాణ పనులను అధికారులు తక్షణమే నిలిపివేయిస్తామని, పూర్తి స్థాయి నివేదిక అందిన వెంటనే బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సంబంధిత అధికారులకుజాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల హక్కులకు భంగం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం ఆమె స్పష్టం చేసారు. ఈ తనిఖీ జిల్లా జాయింట్ కలెక్టర్ తో పాటు మండల తహసిల్దార్, పంచాయతీ అధికారులు, స్వర్ణ గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సోమవారం రాత్రి గన్నవరం లోని విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకున్న కేంద్ర గృహ నిర్మాణం పట్టణ వ్యవహారాల మంత్రి తోఖాన్ సాహు ని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు, పుష్పగుచ్చాలు అందజేసి ఘన స్వాగతం పలికిన స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండి అనిల్ కుమార్ రెడ్డి, హడ్కో రీజినల్ చీఫ్ బి ఎస్ ఏ మూర్తి, గృహనిర్మాణం సంస్థ ఎస్.ఈ, టి. వేణుగోపాల్, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధిపతులు ఎస్ వెంకటరావు, రజనీ కుమారి. తదితరులు..

(అమరావతి, మనం న్యూస్)



## ప్రజల సంతృప్తే లక్ష్యం.. నాణ్యమైన సేవలు అందించండి

- జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్


**పుట్టపర్తి, జూన్ 22 మనం న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందిన అర్జీలను ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేలా త్వరితగతిన, నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత శాఖలకు పంపించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, డీఆర్వో కొండయ్య, ఎస్డీసీ విజయకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ నిర్వహించాలని సూచించారు. అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెన్ కేసులు లేకుండా ప్రతి అర్జీకి సమర్థవంతమైన పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 387 అర్జీలు అందగా, వాటిని పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఎండార్స్ చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రభుత్వంపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచాలని కలెక్టర్ సూచించారు.



## ఈత సరదా... యువకుడు మృత్యువాత

- గంభీరం జలాశయం వద్ద ఘటన

**ఆనందపురం: మనం న్యూస్ : జూన్ 22** గంభీరం రిజర్వాయర్లో ఈతకు వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందిన ఘటన ఆనందపురం మండలంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, విశాఖపట్నానికి చెందిన గొట్టుముక్కల శ్రీధర చక్రవర్తి (28) తన స్నేహితులు జి. ప్రశాంత్, శౌవిక్ చౌదురితో కలిసి సోమవారం తెల్లవారుజామున సూర్యోదయం వీక్షించేందుకు గంభీరం రిజర్వాయర్కు వెళ్లాడు. అనంతరం ముగ్గురూ ఈత కొట్టేందుకు నీటిలోకి దిగారు. ఈతలో నైపుణ్యం కలిగిన వారే అయినప్పటికీ, శ్రీధర చక్రవర్తి కొంత దూరం వెళ్లిన తర్వాత నీటి లోతు ఒక్కసారిగా పెరగడంతో మునిగిపోయినట్లు తెలుస్తోంది. అతని స్నేహితులు ఒడ్డుకు చేరుకోగా, శ్రీధర చక్రవర్తి మాత్రం నీటిలో మునిగిపోయాడు.



సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, విపత్తు నిర్వహణ బృందం సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం శ్రీధర చక్రవర్తి మృతదేహాన్ని గుర్తించి భీమిలి సీహెచ్సీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి తండ్రి గొట్టుముక్కల మధు జగన్నాథ రాజు (59), ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కెమికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్, తన కుమారుడి మృతిపై ఎటువంటి అనుమానం లేదని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆనందపురం సీఐ సీహెచ్ వాసు నాయుడు కేసు నమోదు చేసి, తదుపరి దర్యాప్తును ఎస్ఐ ఎం. హరీష్కు అప్పగించారు. శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

## జూన్ 28వ తేదీన 'పల్స్ పోలియో' కార్యక్రమం

- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**అనంతపురం, కలెక్టరేట్ జూన్ 22 : మనం న్యూస్ :** ఈనెల 28వ తేదీన నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పిలుపునిచ్చారు. ఈనెల 28వ తేదీన నిర్వహించే జాతీయ ఇమ్యూనిజేషన్ కార్యక్రమంలో భాగంగా పల్స్ పోలియో వాక్సినేషన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు



పల్స్ పోలియో- 2026పై జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశాన్ని అసిస్టెంట్ కలెక్టర్ సుయాస్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా.ఈబి.దేవితో కలిసి నిర్వహించి జిల్లా కలెక్టర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటెన్సిఫైడ్ పల్స్ పోలియో ఇమ్యూనిజేషన్ కార్యక్రమాన్ని ఈనెల జూన్ 28వ తేదీన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో 2,83,430 మంది చిన్నారులు (0-5 సంవత్సరాల మధ్య) ఉన్నారని, జిల్లాలోని 31 మండలాల పరిధిలో 51 పిహెచ్సిలు, 25 యూపీహెచ్సీలు, 6 పిపియూనిట్లు కలుపుకుని మొత్తం 82 యూనిట్లలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

# ప్రజా రవాణాలో విప్లవాత్మక సంస్కరణలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ పరమావధిగా, అభివృద్ధి - సంక్షేమం అనే రెండు చక్రాలపై రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమర్థ నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో రవాణా శాఖ గత రెండేళ్లలో ఎన్నడూ లేనివిధంగా పలు సంస్కరణలను అమలు చేయడం జరిగిందని తెలిపారు.

**డిజిటల్ రవాణా సేవలకు కొత్త అధ్యాయం**

ప్రభుత్వం ఏర్పడిన వెంటనే డ్రైవింగ్ లైసెన్సులు, వాహన నమోదు, పర్మిట్లు, ఫీజు చెల్లింపులు తదితర సేవలను పూర్తిగా ఆన్లైన్ విధానంలోకి తీసుకువచ్చి ప్రజలకు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరాన్ని తొలగించడం జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 85 ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ సెంటర్ల ద్వారా పారదర్శక, సాంకేతికత ఆధారిత డ్రైవింగ్ పరీక్షల వ్యవస్థను విజయవంతంగా అమలు చేశామన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ జారీ ప్రక్రియలో మానవ జోక్యాన్ని గణనీయంగా తగ్గించి పూర్తి డిజిటల్ విధానాన్ని ప్రవేశపెట్టామన్నారు. రవాణా శాఖ సేవలన్నింటినీ ఆన్లైన్లో అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలను అందిస్తున్నామన్నారు. మిగిలిన టెస్టింగ్ కేంద్రాలను కూడా రాబోయే మూడు నెలల్లో పూర్తి స్థాయిలో ప్రారంభించి రాష్ట్రవ్యాప్తంగా ఏకరీతి, ఆధునిక సేవలను అందుబాటులోకి తీసుకురానున్నామని మంత్రి తెలిపారు.

**ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం అండ**

ఆటో డ్రైవర్లు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలని గుర్తించిన మా ప్రభుత్వం వారి సంక్షేమం, భద్రత, నైపుణ్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ దిశగా చిత్తూరు, అనంతపురం, కర్నూలు, తిరుపతి, ప్రకాశం, నెల్లూరు, గుంటూరు తదితర జిల్లాల్లో ప్రత్యేక శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసి, ఇప్పటివరకు 2.34 లక్షలకుపైగా ఆటో డ్రైవర్లు, యజమానులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు, ప్రయాణికుల సేవలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందన వంటి అంశాలపై సమగ్ర శిక్షణ అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా ఆటో డ్రైవర్లలో వృత్తిపరమైన నైపుణ్యాలు పెంపొందడంతో పాటు, ప్రజలకు మరింత సురక్షితమైన, నాణ్యమైన రవాణా సేవలు అందించే దిశగా ప్రభుత్వం విజయవంతంగా ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు.

**రవాణా శాఖ ఆదాయంలో రికార్డు వద్ధి**

సమర్థవంతమైన పరిపాలన, సాంకేతికత ఆధారిత సేవల విస్తరణ, పెండింగ్ పన్నుల వసూళ్లపై ప్రత్యేక దష్టి సారించడం వల్ల రవాణా శాఖ ఆదాయంలో గణనీయమైన వద్ధి నమోదైందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ₹4,004 కోట్లుగా ఉన్న శాఖ ఆదాయం, 2025-26 నాటికి ₹5,050 కోట్లకు పెరగడం ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు, పారదర్శక పరిపాలన మరియు సమర్థవంతమైన ఆర్థిక నిర్వహణకు నిదర్శనమని మంత్రి తెలిపారు.

# ఎల్నినోను ధైర్యంగా ఎదుర్కొందాం

(మొదటి పేజీ తరువాయి)

అండగా నిలుస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. సచివాలయంలో రైతులకు ఉపయోగపడే విధంగా వ్యవసాయ శాఖ రూపొందించిన ఎల్నినోను సమర్థవంతంగా ఎదుర్కొందాం అనే ప్రత్యేక సమాచార సంచికను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వాతావరణ మార్పులు, వర్షపాతం లోపాలు, అధిక ఉష్ణోగ్రతలు వంటి ఎల్నినో ప్రభావాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్రంలోని వివిధ వ్యవసాయ వాతావరణ మండలాలకు అనుగుణంగా పంటల ఎంపిక, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి యాజమాన్య పద్ధతులు, నేల తేమ సంరక్షణ చర్యలు, విత్తనాల వినియోగం, పంటల సంరక్షణకు సంబంధించిన సమగ్ర సూచనలను ఈ సమాచార సంచికలో పొందుపరిచినట్లు తెలిపారు. రైతులు ఈ సూచనలను పాటించడం ద్వారా వాతావరణ ప్రతికూల పరిస్థితులను అధిగమించి దిగుబడులను



కాపాడుకోవచ్చన్నారు. వ్యవసాయ శాఖతో పాటు ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య, పట్టు పరిశ్రమ, సహకార శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ఎల్నినో ప్రభావాన్ని తగ్గించే చర్యలను అమలు చేస్తున్నాయని మంత్రి వెల్లడించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, వాతావరణ హెచ్చరికలు, పంటల నిర్వహణ సూచనలు గ్రామ స్థాయి వరకు చేరేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, వాతావరణ నిపుణుల సూచనల ఆధారంగా రూపొందించిన ఈ ప్రత్యేక సంచిక రైతులకు మార్గదర్శకంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పంటల వారీగా, ప్రాంతాల వారీగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే పద్ధతులు, కరువు పరిస్థితులను ఎదుర్కొనే వ్యవసాయ నిర్వహణ చర్యలు ఇందులో పొందుపరచినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఎలాంటి వాతావరణ సవాళ్లు ఎదురైనా రైతులను ఆదుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు సిద్ధంగా ఉన్నాయని మంత్రి స్పష్టం చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామ స్థాయిలో రైతులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆయన ఆదేశించారు.ఈ ప్రత్యేక సమాచార సంచిక ద్వారా రైతులు శాస్త్రీయ అవగాహన పెంపొందించుకొని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు నిర్ణయాలు తీసుకోవడంతో పాటు నష్టాలను తగ్గించుకునే అవకాశం కలుగుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బీ. రాజశేఖర్, డైరెక్టర్ మంజీర్ జిలానీ, ఉన్నతాధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల కమిషనర్ను కలిసిన మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఫారూఖ్ షబ్లీ ,రాష్ట్ర అహ్లే సున్నత్ జమాత్ కన్వీనర్ సూఫీ మత గురువులు అల్తాఫ్ బాబా

**అమరావతి,జూన్,22,(మనం ప్రతినిధి):** రాష్ట్రవ్యాప్తంగా,దేశవ్యాప్తంగా ప్రస్తుతం సాగుతున్న ఎస్ఐఆర్ (ఖిఐఖ) ప్రక్రియపై ముస్లిం సమాజంలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోందని, గతంలో ఎన్నార్సీ సమయంలో వచ్చినటువంటి భయాందోళనలే ఇప్పుడు మళ్లీ కనిపిస్తున్నాయని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఫారూఖ్ షబ్లీ,రాష్ట్ర అహ్లే సున్నత్ జమాత్ కన్వీనర్ సూఫీ మత గురువులు అల్తాఫ్ బాబా పేర్కొన్నారు .. సోమవారం బందరు రోడ్డులోని ఎలక్షన్ కమిషనర్ (ఈసీ) ను కలిసి పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని వారు అందజేశారు. సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్లో సెక్యులర్ భావాలు కలిగిన ప్రాంతీయ పార్టీలు ఉన్నాయని, నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ ముస్లింలకు అన్యాయం జరగదని తాము 100 శాతం



నమ్ముతున్నామని స్పష్టం చేశారు. అయితే ఎస్ఐఆర్ ప్రక్రియలో కొన్ని ప్రాక్టికల్ సమస్యలు ఉన్నాయని, వాటిని ఈసీ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. బీహార్, గుజరాత్ కేరళ వంటి ఇతర రాష్ట్రాల నుండి వచ్చి ఇక్కడ నివసిస్తున్న వారి ఓట్లు గల్లంతయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు ముస్లిం సమాజంలోని నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకుని, ఓట్లు తొలగిపోతాయని, పథకాలు రావంటూ భయానకమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఎస్ఐఆర్ గనుక పక్షపాతం లేకుండా నిష్పక్షపాతంగా జరిగితే స్థానికులకు అన్ని రకాల ప్రభుత్వ పథకాలు అందుతాయని, డబుల్ బెనిఫిట్స్ పొందుతున్న వారికి అడ్డుకట్ట పడుతుందని తెలిపారు.మెనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 65 నియోజకవర్గాల్లో హెల్ప్ డెస్క్లు ఏర్పాటు చేసి ఫామ్-6, ఫామ్-8 నమోదుపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. నిబంధనల ప్రకారం బూత్ లెవెల్ ఏజెంట్లు (ఆఔఅట), బూత్ లెవెల్ ఆఫీసర్లతో (ఆఔౖ) కలిసి రావాల్సి ఉన్నా, క్షేత్రస్థాయిలో అది జరగడం లేదని విమర్శించారు. బీఎల్ఓలు వేరే పనుల్లో బిజీగా ఉంటూ కేవలం ఫారాలు చేతిలో పెట్టి పూర్తి చేయమంటున్నారని, వాటిలో ఏ చిన్న తప్పు ఉన్నా పక్కన పెట్టేస్తున్నారని ఆరోపించారు. ఈ వన్-మంత్ ప్రాసెస్ (నెల రోజుల సమయం) ఏమాత్రం సరిపోదని, అందువల్ల ఎస్ఐఆర్ గడువును పొడిగించాలని ఎన్నికల కమిషనర్ను కోరారు. ఆన్లైన్ ద్వారా ఎస్ఐఆర్ ప్రక్రియ చేసేటప్పుడు సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు వివరించారు. ఆధార్ కార్డులో సర్ నేమ్ (ఇంటి పేరు) మొదట్లో ఉంటే, ఓటర్ ఐడీలో చివర్లో ఉంటోందని.. ఈ రెండింటినీ ఎంటర్ చేసినప్పుడు 'మిస్మ్యాచ్' అని చూపిస్తూ దరఖాస్తులను తిరస్కరిస్తున్నారని ఈసీకి వివరించారు. దీనిపై ఎన్నికల కమిషనర్ సానుకూలంగా స్పందించారని, ముస్లిం, క్రిస్టియన్, హిందూ అనే భేదం తమకు లేదని, అందరికీ న్యాయం జరిగేలా సమగ్ర విచారణ జరిపి మంచి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు వెల్లడించారు. ఈ సి నీ కలిసిన వారిలో , మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మౌలానా హుస్సేన్, జమీయత్ అహలె హదీస్ అధ్యక్షులు నసీర్ అహ్మద్ ఉన్నారు. ప్రభుత్వ ఖాజీ హాఫిజ్ అబ్దుల్ సమద్ .. తదితరులు పాల్గొన్నారు..

## ప్రతి ఫిర్యాదుకు న్యాయం చేస్తాం

- జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

**పుట్టపర్తి, జూన్ 22 మనం న్యూస్:** బాధితుల ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి చట్టబద్ధంగా న్యాయం చేస్తామని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ తెలిపారు. పుట్టపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి మొత్తం 80 వినతిపత్రాలను ఆయన స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలను నేరుగా ఎస్పీ దృష్టికి తీసుకురాగా, అందిన ప్రతి వినతిని ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి కేసును నిష్పక్షపాతంగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన వికలాంగులు, వృద్ధులను గమనించిన ఎస్పీ స్వయంగా వారి వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి ఇబ్బందులను ఓపికగా విని,



అవసరమైన సహాయం అందించేలా వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ఎలాంటి సంకోచం లేకుండా తమ సమస్యలను పోలీసు శాఖ దృష్టికి తీసుకురావాలని, అందిన ప్రతి ఫిర్యాదుపై న్యాయపరంగా స్పందిస్తూ బాధితులకు అండగా నిలుస్తామని ఎస్పీ పేర్కొన్నారు.ఈ వేదికలో కుటుంబ వివాదాలు, భూ తగాదాలు, సైబర్ మోసాలు, ఇతర వ్యక్తిగత మరియు సామాజిక సమస్యలకు సంబంధించిన మొత్తం 80 వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అంకిత సురాన, ఐపీఎస్, సీఐలు బొజ్జప్ప, లక్ష్మీకాంత్ రెడ్డి, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి తదితర అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

# డిజిటల్ చెల్లింపుల కౌంటర్లకు భద్రతా సిబ్బంది మళ్లింపు

- **కొండపై సెక్యూరిటీ పాయింట్లలో ఖాళీలు!**



**అన్నవరం, జూన్ 22, మనం న్యూస్ :** అన్నవరం దేవస్థానంలో నగదు రహిత లావాదేవీలు, డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించే చర్యల నేపథ్యంలో భద్రతా విభాగానికి చెందిన హోంగార్డులు, ప్రైవేటు సెక్యూరిటీ గార్డులను డిజిటల్ చెల్లింపుల కౌంటర్ల వద్ద విధుల్లో నియమించడం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం సుమారు 14 మంది భద్రతా సిబ్బంది ఈ కౌంటర్ల వద్ద విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. దీంతో రత్నగిరి కొండపై వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన భద్రతా పాయింట్ల వద్ద సిబ్బంది కొరత ఏర్పడిందని సెక్యూరిటీ విభాగానికి చెందిన ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాలు, క్యూ లైన్లు, కూడళ్ల వద్ద తగిన సంఖ్యలో సెక్యూరిటీ సిబ్బంది అందుబాటులో లేకపోవడం వల్ల విధుల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు చెబుతున్నారు. డిజిటల్ చెల్లింపుల కౌంటర్ల నిర్వహణకు సన్నిధి విభాగంలోని సిబ్బందిని వినియోగించుకునే అవకాశం ఉన్నప్పటికీ, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఉద్యోగ వర్గాలు పేర్కొంటున్నాయి. భద్రతా బాధ్యతల కోసం నియమితులైన సిబ్బందిని ఇతర పనులకు మళ్లించడం వల్ల అసలు భద్రతా వ్యవస్థ బలహీనపడే ప్రమాదం ఉందని అభిప్రాయపడుతున్నారు. ఇదే సమయంలో సన్నిధి విభాగంలో అవసరమైన మేర సిబ్బంది అందుబాటులో ఉన్నప్పటికీ వారిని సమర్థంగా వినియోగించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. భక్తుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ సెక్యూరిటీ సిబ్బందిని తిరిగి వారి అసలు విధుల్లో నియమించాలని, డిజిటల్ చెల్లింపుల నిర్వహణకు సంబంధిత విభాగాల సిబ్బందినే వినియోగించాలని ఉద్యోగులు, భక్తులు కోరుతున్నారు. ఈ అంశంపై దేవస్థానం ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మనమిత్ర యాప్తో భక్తుల అవస్థలు.. నెట్వర్క్ సమస్యలతో ఇబ్బందులు అన్నవరం దేవస్థానంలో నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించేందుకు మనమిత్ర యాప్ను భక్తులు విస్తృతంగా వినియోగిస్తున్నారు. అయితే నెట్వర్క్ సమస్యలు భక్తులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. దేవస్థానం ఏర్పాటు చేసిన అన్నవరం ఫ్రీ వైఫై సేవలు సరిగా పనిచేయడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో వైఫై సిగ్నల్ కనిపించినప్పటికీ ఇంటర్నెట్ కనెక్టివిటీ లేకపోవడం గమనార్హం. మరికొన్ని చోట్ల నెట్వర్క్ అందుబాటులో లేక డిజిటల్ చెల్లింపులు నిలిచిపోతున్నాయి. ప్రసాదాల కొనుగోలు, వసతి చెల్లింపులు, ఇతర సేవల కోసం భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెల్లింపులు పూర్తికాక కౌంటర్ల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ముఖ్యంగా రద్దీ సమయాల్లో సమస్య మరింత తీవ్రంగా మారుతోందని భక్తులు చెబుతున్నారు. డిజిటల్ సేవలను ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో నెట్వర్క్ మౌలిక వసతులను మెరుగుపరచాలని వారు కోరుతున్నారు. భక్తుల సౌకర్యార్థం వైఫై, మొబైల్ సిగ్నల్ వ్యవస్థలను బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## విత్తనాల మొలక శాతం తెలుసుకోవాలి

- **వ్యవసాయ అధికారి పి గాంధీ**

**శంఖవరం జూన్ 22 మనం ప్రతినిధి:** వరి విత్తనాల మొలక శాతం చూశాకే విత్తనాల అమ్మకాలు చేయాలని వర్తకులకు వ్యవసాయ అధికారి పి గాంధీ సూచించారు. కత్తిపూడిలో గల విత్తనాల దుకాణాలను తనిఖీ చేసి వివిధ రకాల వరి విత్తనాల స్టాక్ ను పరిశీలించి సూచనలు ఇచ్చారు.రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే అమ్మాలని ,స్టాక్ బోర్డు వద్ద రకాల వారీగా రోజు వారి నిల్వలు చూపాలని తెలిపారు.రైతులు తాము కొనుగోలు చేసిన లేదా సొంత విత్తనాలను కూడా మొలక శాతం చూశాక మరియు విత్తన మొలక శాతం 85 శాతం కంటే ఎక్కువ ఉంటే ఆ విత్తనాలు నాణ్యమైనవిగా గమనించాలని వివరించారు.అనౌతరం విత్తన నమూనాలను పరీక్ష కొరకు సేకరించారు. ఈ కార్యక్రమం లో ఉద్యాన సహాయకులు గోవిందరాజులు,వర్తకులు పాల్గొన్నారు.



# మానవత్వంతో ఆదుకుంటున్నాం

**76 మందికి రూ. 66.42 లక్షలు సి ఎం ఆర్ ఎఫ్ చెక్కులు అందజేసిన మంత్రి నిమ్మల**



**పాలకొల్లు, జూన్ 22,మనం ప్రతినిధి** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మానవత్వంతో పని చేస్తుందని, పేద మధ్యతరగతి వర్గాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వైద్యసాయంగా ఆర్థికంగా ఆదుకుంటున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లులోని మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద పాలకొల్లు నియోజకవర్గంలోని నిరుపేద వర్గాలకు చెందిన 76 మందికి ముఖ్యమంత్రి సహాయనిధిగా 66.42 లక్షల చెక్కులను కూటమి నాయకులతో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ గత వైసిపి ఐదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి సహాయనిధి అమలు చేయలేని మానవత్వం లేని వ్యక్తి జగన్ అని పేర్కొన్నారు. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెద్ద ఎత్తున సాయం అందిస్తున్నామని, ఈ రెండేళ్లలో 14.22 కోట్లు అందించామని మంత్రి నిమ్మల తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి సాయం అందుకున్న పలువురు ఆర్థిక పరిస్థితులను వివరిస్తూ వారి కుటుంబానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గొడ్డలి పార్టీకి అసత్యపు చానల్, అబద్దాల పత్రిక ఉందని, కూటమికి మాత్రం లబ్ధి పొందిన లబ్ధిదారులే మరో 10 మందికి బయలు జరిగిన విషయాన్ని చెప్పి మంచి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని మంత్రి నిమ్మల కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## నూతన సీఐ బాలసురేశ్‌కు వారధి ప్రెస్ క్లబ్ ఘన సత్కారం

**కుక్కునూరు,జూన్ 22( మనం న్యూస్ )** కుక్కునూరు నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ)గా బాధ్యతలు స్వీకరించిన బాలసురేష్ను వారధి ప్రెస్ క్లబ్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ పోలీసు శాఖ తరపున విశిష్ట సేవలందించాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం సీఐ బాలసురేష్ను పుష్పగుచ్ఛంతో అభినందించి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు నిమ్మల ప్రసాద్, సెక్రెటరీ చాంద్ పాషా, గౌరవ అధ్యక్షులు మంత్రి గోపాలకృష్ణతో పాటు సభ్యులు సురేష్, చైతన్య, విశ్వనాథం, వేణు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



- **ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్**

**నరసాపురం, జూన్ 22 (మనం న్యూస్) :** గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతులు కల్పనకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని గ్రామాల అభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం అవసరమైన పనులను దశలవారీగా చేపడుతున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ తెలిపారు. నరసాపురం మండలం కొత్త నవరసపురం గ్రామంలో రూ.55 లక్షల నిధులతో నిర్మించిన మైక్రో ఫిల్టర్ ప్లాంట్, 40 కిలోలీటర్ల ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్, సంపులను ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన, నాణ్యమైన తాగునీటిని అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి గ్రామానికి సురక్షిత తాగునీటి సరఫరా అందేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆయన అన్నారు. గ్రామ ప్రజలకు మెరుగైన తాగునీటి సదుపాయాలు అందించేందుకు ఈ ప్రాజెక్టు ఎంతో ఉపయోగపడుతుందని స్థానికులు హర్షం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెదేపా ఇంచార్జ్ పొత్తూరి రామరాజు, రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి సంస్థ చైర్మన్ కొల్లు పెద్దరాజు, ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, వైస్ చైర్మన్ దేసినీడి గంగాధర్, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ఆకన చంద్రశేఖర్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ వలవల నాని, అడ్డాల బాబి, పైడికొండల కృష్ణ, దేవరపు బాబి, ఆదిమూలపు వెంకటేశ్వరరావు, నియోజకవర్గ ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 5 శాతం రిజర్వేషన్లు ఎత్తేసినప్పుడు నోరు పెగల్లేదేం

- **కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు**



**నరసాపురం, జూలై 22 (మనం న్యూస్) :** కూటమి ప్రభుత్వంలో కాపులకు అన్యాయం జరుగు తోందని కాపులపై దాడులు అధికమయ్యాయని కాపులపై కపట ప్రేమ కురిపిస్తున్న వైసీపీ కాపు నాయకులకు గత వైసీపీ ప్రభుత్వంలో కాపులకు తీవ్ర అన్యాయం, అవమానాలు జరిగినా ఆనాడు తమ అధినేతను ప్రశ్నించేందుకు ఎందుకు నోరు పెగల్లేదని మాజీమంత్రి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు ప్రశ్నించారు. సోమవారం ఆయన తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం కాపుల సంక్షేమానికి పదివేల కోట్ల రూపాయలకు ఖర్చు చేసిందని రానున్న మూడేళ్లలో మరో 25 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గత ఎన్నికలలో ఇచ్చిన హామీలలో అనేక పథకాలను అమలు చేస్తున్నారని మిగిలిన హామీలను కూడా ప్రాధాన్యత క్రమంలో అమలు చేయనున్నామని అన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలతో పాటు కాపుల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని సుబ్బారాయుడు స్పష్టం చేశారు. గతంలో కాపులు చేసిన ఎన్నో పోరాటాల ఫలితంగా 2014లో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కాపులకు ఐదు శాతం రిజర్వేషన్లు అమలు చేయగా 2019లో అధికారం చేపట్టిన జగన్ ఆ రిజర్వేషన్లను ఎత్తేసారని ఇప్పుడు కాపులపై కపట ప్రేమ చూపిస్తున్న ఈ కుహనా వైసిపి కాపు నాయకులు ఆనాడు తమ అధినేతను ఎందుకు ప్రశ్నించలేకపోయారని ఆయన మండిపడ్డారు. నేరస్తులకు కులం ఆపాదించడంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై వైసీపీ కాపు నాయకులు రాద్ధాంతం చేయడం తగదని పవన్ కళ్యాణ్ ను ప్రశ్నించే స్థాయి వారికి లేదని సుబ్బారాయుడు స్పష్టం చేశారు. పవన్ కళ్యాణ్ కేవలం కాపు కులానికి మాత్రమే నాయకుడు కాదని ఆయన అన్ని కులాలు, వర్గాలకు సంబంధించిన నాయకుడని దేశంలోనే ఆయన వంటి నిజాయితీ, నిబద్ధత కలిగిన నాయకుడు లేరని అన్నారు. పవన్ కళ్యాణ్ పై వైసీపీ నాయకులు మరోసారి అవాకులు చవాకులు పేలితే తీవ్ర పర్యావసానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు వన్నెంరెడ్డి శ్రీనివాస్, గుగ్గిలపు మురళి, పలువురు కాపు నాయకులు పాల్గొన్నారు.

# భక్తుల వసతి కష్టాలకు శాశ్వత పరిష్కారం..

- **రత్నగిరిపై 140 గదులతో నూతన వసతి సముదాయం నిర్మాణం**

**అన్నవరం, జూన్ 22, మనం న్యూస్ :** అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారిని దర్శించేందుకు ప్రతిరోజూ వేలాదిమంది భక్తులు రత్నగిరికి తరలివస్తుంటారు. ముఖ్యంగా పౌర్ణమి, ఏకాదశి, కార్తీక మాసం, సెలవు దినాల్లో భక్తుల రద్దీ మరింత పెరుగుతుంది. దర్శనం అనంతరం స్వామివారి సన్నిధిలో రాత్రి బస చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించాలని అనుకునే భక్తులు తరచూ వసతి సమస్యను ఎదుర్కొంటున్నారు. భక్తుల ఈ అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని దేవస్థానం ఆధునిక వసతి సముదాయం నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ప్రకాష్ సదన్ సమీపంలోని శిథిలావస్థకు చేరుకున్న సీతారామ సత్రం దక్షిణ భాగాన్ని తొలగించి ఆ ప్రదేశంలో నాలుగు అంతస్తుల నూతన భవనాన్ని నిర్మిస్తున్నారు. ఒక్కో అంతస్తులో 35 గదుల చొప్పున మొత్తం 140 గదులు ఏర్పాటు చేయనున్నారు. సుమారు రూ.11.40 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ నిర్మాణ పనులకు ఈ ఏడాది ఏప్రిల్ 12న దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ పర్యవేక్షణలో పనులు వేగంగా కొనసాగుతున్నాయి. అన్నవరం కొండపై ఇప్పటికే సుమారు 400కు పైగా గదులు అందుబాటులో ఉన్నప్పటికీ, భక్తుల సంఖ్యకు అనుగుణంగా అవి సరిపోవడం లేదు. ముఖ్యమైన పర్వదినాల్లో గదులు దొరకక భక్తులు ఇబ్బందులు పడుతున్న సందర్భాలు తరచూ కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా నిర్మిస్తున్న వసతి సముదాయం భక్తులకు ఎంతో ఉపయుక్తంగా మారనుంది. స్వామివారి దర్శనం కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు సౌకర్యవంతమైన వసతి కల్పించడం కూడా ఒక విధమైన సేవగా భావిస్తారు. అతిథి దేవోభవ అనే భారతీయ సంస్కృతి స్ఫూర్తితో భక్తులకు మెరుగైన సదుపాయాలు అందించాలనే లక్ష్యంతో దేవస్థానం ఈ ప్రాజెక్టును చేపట్టింది. నిర్మాణం పూర్తయిన తర్వాత రత్నగిరిపై బస సౌకర్యాలు మరింత విస్తరించి, భక్తులు ప్రశాంత వాతావరణంలో స్వామివారి సేవలో పాల్గొనే అవకాశం కలుగుతుందని భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భక్తుల సౌకర్యాలే లక్ష్యంగా మరిన్ని మౌలిక వసతులు అవసరం... అన్నవరం క్షేత్ర అభివృద్ధిపై భక్తుల సూచనలు ₹అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి ఆలయానికి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు




తరలివస్తుండటంతో భక్తుల అవసరాలకు అనుగుణంగా మరిన్ని మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం వసతి గదుల నిర్మాణం, రహదారుల అభివృద్ధి వంటి పనులు జరుగుతున్నప్పటికీ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచిస్తున్నారు. ₹కొండపైకి వచ్చే భక్తులకు తాగునీటి సదుపాయాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది. రద్దీ ప్రాంతాల్లో అదనపు చల్లని తాగునీటి కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఉచిత దర్శనం, శీఘ్ర దర్శనం క్యూలైన్ల వద్ద విశ్రాంతి కోసం మరిన్ని కూర్చునే ఏర్పాట్లు చేయాలని భక్తులు సూచిస్తున్నారు. ₹రత్నగిరిపై పార్కింగ్ స్థలాలను విస్తరించి వాహనాల రద్దీని తగ్గించే చర్యలు చేపట్టాలని, ఘాట్ రోడ్డు మార్గంలో సీసీ కెమెరాల సంఖ్య పెంచి భద్రతను బలోపేతం చేయాలని కోరుతున్నారు. అలాగే వృద్ధులు, దివ్యాంగుల కోసం బ్యాటరీ వాహనాల సేవలను పెంచాలని సూచిస్తున్నారు.భక్తులకు సమాచారం అందించే డిజిటల్ డిస్ప్లే బోర్డులు, దర్శన సమయాలు, గదుల లభ్యత, ప్రసాదాల వివరాలు తెలియజేసే ఆధునిక వ్యవస్థలను ఏర్పాటు చేస్తే మరింత సౌకర్యంగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. సత్రాలు, కాటేజీల వద్ద పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ అదనపు పారిశుధ్య సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు. ₹అన్నదాన కేంద్రాలు, మరుగుదొడ్లు, విశ్రాంతి మండపాల సంఖ్యను పెంచడంతో పాటు అత్యవసర వైద్య సేవలను 24 గంటలూ అందుబాటులో ఉంచాలని భక్తులు సూచిస్తున్నారు. కొండపై పచ్చదనాన్ని పెంచేందుకు నీడనిచ్చే మొక్కలను నాటితే భక్తులకు ఉపశమనం కలుగుతుందని పేర్కొంటున్నారు. ₹ఆధ్యాత్మిక క్షేత్రంగా రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న అన్నవరం దేవస్థానంలో భక్తుల సౌకర్యాలే ప్రధాన లక్ష్యంగా అధికారులు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తే దేశవ్యాప్తంగా ఆదర్శ దేవస్థానంగా నిలుస్తుందని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

## ధ్వజస్తంభంపై ఒరిగిన కలశం-శంఖుచక్రం

- **నాలుగు రోజులైనా పట్టించుకోని అధికారులు?**

**అన్నవరం, జూన్ 22, మనం న్యూస్ :** కాకినాడ జిల్లా అన్నవరం రత్నగిరిపై కొలువై ఉన్న శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి ఆలయంలో ధ్వజస్తంభంపై ఏర్పాటు చేసిన కలశం, శంఖు-చక్రం ఇటీవల వీచిన ఈదురు గాలుల ప్రభావంతో ఒరిగిపోయినట్లు భక్తులు గుర్తించారు. ఆలయ గర్భగుడి ఎదురుగా ఉన్న ధ్వజస్తంభం పైన ఉన్న ఈ పవిత్ర చిహ్నాలు నాలుగు రోజులుగా వంగిన స్థితిలో కనిపిస్తున్నప్పటికీ దేవస్థానం అధికారులు ఇప్పటివరకు స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఆలయానికి విచ్చేస్తున్న భక్తులు ధ్వజస్తంభాన్ని దర్శించే సమయంలో కలశం, శంఖు-చక్రం ఒరిగిన విషయాన్ని గమనించి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హిందూ ఆలయ సంప్రదాయంలో ధ్వజస్తంభం, దానిపై ఉన్న కలశం, శంఖు-చక్రాలకు ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది. ఇవి ఆలయ వైభవానికి, దైవ చైతన్యానికి ప్రతీకలుగా భావిస్తారు. ఆగమ శాస్త్ర నిపుణులు, పండితుల అభిప్రాయం ప్రకారం ఆలయ ధ్వజస్తంభంపై ఉన్న పవిత్ర చిహ్నాలు దెబ్బతినడం లేదా ఒరిగిపోవడం శుభసూచకం కాదని చెబుతున్నారు. ఇటువంటి పరిస్థితులు ఏర్పడినప్పుడు వెంటనే పరిశీలించి మరమ్మతులు చేపట్టడం అవసరమని సూచిస్తున్నారు. ఇప్పటికే భక్తులు పలుమార్లు ఈ విషయాన్ని దేవస్థానం



సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి చర్యలు కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు. వేలాది మంది భక్తులు నిత్యం దర్శించే ప్రధాన ఆలయంలో ఇలాంటి అంశాలను అధికారులు నిర్లక్ష్యం చేయడం సరైన విధానం కాదని అభిప్రాయపడుతున్నారు. ధ్వజస్తంభంపైకి సాంకేతిక సిబ్బందిని పంపించి కలశం, శంఖు-చక్రం పరిస్థితిని పరిశీలించి తక్షణమే సరిచేయాలని భక్తులు కోరుతున్నారు. ఆలయ పవిత్రత, సంప్రదాయాలకు సంబంధించిన అంశాల్లో అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచిస్తున్నారు. ఈ ఘటనపై దేవస్థానం అధికారులు స్పందించి, ఒరిగిన కలశం-శంఖు చక్రాన్ని ఎప్పుడు సరిచేస్తారో వేచి చూడాల్సి ఉంది.

## అన్నదాన విభాగంలో నిర్లక్ష్యంపై ఈవో ఆగ్రహం.!

**అన్నవరం, జూన్,22, మనం న్యూస్:** అన్నవరం దేవస్థానం రత్నగిరిపై ఉన్న అన్నదాన విభాగంలో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ జరుగుతున్న సమయంలో కొందరు సిబ్బంది విధులను పక్కనపెట్టి కార్యాలయాలకే పరిమితమైన ఘటనపై దేవస్థానం ఈవో చక్రధర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా నిర్వహించిన సాధారణ తనిఖీలలో భాగంగా సోమవారం అన్నదాన విభాగాన్ని పరిశీలించిన ఆయన, కొందరు సిబ్బంది విధులపై దృష్టి పెట్టకుండా ముచ్చట్లలో నిమగ్నమై ఉండడాన్ని గమనించారు. భక్తులకు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అన్నప్రసాదం అందించే సమయంలో ప్రతి సిబ్బంది తమకు కేటాయించిన బాధ్యతల వద్దే ఉండాలని ఆదేశించారు. అన్నప్రసాదం పంపిణీ సమయంలో భక్తుల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి స్పందించాలని సూచించారు. దేవస్థానం ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా ఎలాంటి చర్యలు ఉండకూడదని, భక్తులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి ఉద్యోగి పనిచేయాలని ఈవో చక్రధర్ రావు సూచించారు. ఈ ఘటన అనంతరం అన్నదాన విభాగంలో సిబ్బంది హాజరు, విధుల నిర్వహణపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టనున్నట్లు సమాచారం.

# అన్నవరం సత్యదేవుని హుండీలకు రూ.1.96 కోట్ల ఆదాయం

**అన్నవరం, జూన్ 22, మనం న్యూస్. :** కాకినాడ జిల్లా అన్నవరంలోని శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి ఆలయానికి భక్తులు సమర్పించిన హుండీల ద్వారా రూ.1 కోటి 96 లక్షల 60 వేల ఆదాయం సమకూరింది. సోమవారం దేవస్థానం చైర్మన్ రోహిత్, ఈవో చక్రధర్ రావు, పాలకమండలి సభ్యులు పర్వత సురేష్ కామర్స్ చిరంజీవి రావు ఆధ్వర్యంలో స్వామివారి శాశ్వత కళ్యాణ మండపంలో హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 33 రోజుల వ్యవధికి సంబంధించిన హుండీలను తెరిచి లెక్కించగా ఈ మేరకు ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. దేశ విదేశాల నుంచి విచ్చేసే భక్తుల భక్తి ప్రపత్తికి నిదర్శనంగా విదేశీ కరెన్సీ కూడా గణనీయంగా లభించింది. హుండీలలో యూఎస్ఏ డాలర్లు 230, యూఏఈ దిర్హామ్స్ 10, కెనడా డాలర్లు 10, సింగపూర్ డాలర్లు 119, మలేషియా కరెన్సీ 1, యూరోలు 55, ఇంగ్లాండ్ కరెన్సీ 10, డెన్మార్క్ కరెన్సీ 100, శ్రీలంక కరెన్సీ 100, సౌత్ ఆఫ్రికా కరెన్సీ 200 లభించినట్లు తెలిపారు. భక్తులు స్వామివారిపై ఉంచిన అపార విశ్వాసంతో హుండీల ఆదాయం




గణనీయంగా పెరుగుతోందని అధికారులు పేర్కొన్నారు. హుండీల ద్వారా లభించే ఆదాయాన్ని దేవస్థాన అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన, వివిధ ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఈ హుండీల లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, వ్రత పురోహితులు, సేవకులు, స్వచ్ఛంద సేవకులు పాల్గొని లెక్కింపును పారదర్శకంగా నిర్వహించారు. స్వామివారి కృపాకటాక్షాలతో ఆలయానికి భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతోందని దేవస్థానం అధికారులు తెలిపారు.

## బాలికలు, మహిళలపై నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

**పాలకొల్లు, జూన్ 22,మనం ప్రతినిధి** పశ్చిమగోదావరి జిల్లా పోలీస్ శాఖ వారి ఆధ్వర్యంలో పాలకొల్లు పట్టణంలోని అల్లు వెంకట సత్యనారాయణ మూర్తి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులు కె.గోపీకృష్ణ అధ్యక్షతన బాలికలు, మహిళలపై నేరాలు - వాటి నియంత్రణ - చట్టాలపై₹ అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు పట్టణ సబ్ ఇన్ స్పెక్టర్ పృధ్వి మరియు ఏఎస్ఐ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. బాలికలు సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలు వివరించి, నేరాలకు ఎలా దూరంగా ఉండాలి, ఆకతాయిల పట్ల ఏ విధంగా ప్రవర్తించాలి అనే విషయాలను తెలియజేసి, మహిళలకు గల ప్రత్యేక చట్టాలను ఎస్ ఐ పృథ్వి వివరించారు. పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు కె. గోపీకృష్ణ మాట్లాడుతూ బాలబాలికలు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, ఆన్లైన్లో పరిచయం అయ్యే అపరిచిత వ్యక్తులకు దూరంగా ఉండాలని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పి. రాంజీ అంబేద్కర్, డి. సుబ్బలక్ష్మి , కె వెంకటేశ్వర రావు మరియు స్థానిక సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సత్తుపల్లి-కొవ్వూరు రైల్వేలైన్తో జీలుగుమిల్లికి మహర్దశ

- **జనసేన నేత గడ్డమణుగు రవికుమార్.**



**జీలుగుమిల్లి,జూన్ 22 (మనం న్యూస్):**సత్తుపల్లి-కొవ్వూరు రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ఏజెన్సీ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం సాకారమయ్యే దిశగా కీలక ముందడుగని మాజీ జడ్పిటిసి,ద్వారకాతిరుమల దేవస్థానం ధర్మకర్త మండలి ప్రత్యేక ఆహ్వానితులు, జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ అన్నారు.ఈ ప్రాజెక్టు అమలులోకి వస్తే రాష్ట్ర సరిహద్దు మండలమైన జీలుగుమిల్లికి ప్రత్యేక గుర్తింపు లభించడంతో పాటు అభివృద్ధికి కొత్త మార్గాలు తెరుచుకుంటాయని పేర్కొన్నారు.సోమవారం ఆయన మాట్లాడుతూ సత్తుపల్లి-కొవ్వూరు మధ్య సుమారు 119 కిలోమీటర్ల రైల్వే మార్గం నిర్మాణం పూర్తయితే హైదరాబాద్,విశాఖపట్నం వంటి ప్రధాన నగరాలకు ప్రయాణం మరింత సులభతరం అవుతుందని తెలిపారు. అశ్వారావుపేట,జీలుగుమిల్లి తదితర పరిసర ప్రాంతాలు రవాణా,వాణిజ్య రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించి పట్టణీకరణ దిశగా అడుగులు వేస్తాయని అన్నారు.రైల్వే లైన్ అందుబాటులోకి రావడం వల్ల రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను తక్కువ ఖర్చుతో వేగంగా మార్కెట్లకు తరలించే అవకాశం లభిస్తుందని చెప్పారు.అలాగే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలు సమీప పట్టణాలు,నగరాలకు సులభంగా చేరుకునే సౌకర్యం కలుగుతుందని వివరించారు.ఏజెన్సీ ప్రాంత ఆర్థికాభివృద్ధికి ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుందని,ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని రవికుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ ప్రతిష్ఠాత్మక రైల్వే మార్గం త్వరితగతిన పూర్తయ్యి ప్రజలకు అందుబాటులోకి రావాలని ఆయన ఆకాంక్షించారు. దశాబ్దాలుగా ఏజెన్సీ వాసులు ఎదురు చూస్తున్న ఆంధ్ర, తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలకు మణిహారం, ఆంధ్రాకు ముఖద్వారం అయిన జీలుగుమిల్లికి రైల్వే స్టేషన్ రావడం,రైల్వే లైనుకు ఆమోదం తెలిపిన ఎన్.డి.ఏ ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



# ఫుల్ స్వింగ్‌లో చిరు-బాబీ మూవీ

అగ్ర కథానాయకుడు చిరంజీవి ఫుల్ జోష్ లో ఉన్నారు. ఆయన సినిమా మొదలు పెట్టడమే ఆలస్యం పరుగులు పెట్టిస్తున్నారు. చిరు కీలక పాత్రలో బాబీ దర్శకత్వంలో ఓ మూవీ రూపొందుతున్న సంగతి తెలిసిందే. మెగా158 (వర్కింగ్ టైటిల్)గా రానున్న ఈ మూవీ షూటింగ్ శరవేగంగా సాగుతోంది. ఇటీవలే పొల్లాచ్చిలో కీలక షెడ్యూల్ ని పూర్తి చేసుకుంది. సోమవారం నుంచి హైదరాబాద్ లో కొత్త షెడ్యూల్ మొదలైంది. చిరుతో పాటు ప్రధాన తారాగణంపై కీలక టాకీ పార్ట్ ను చిత్రీకరిస్తున్నారు. ఈ క్రమంలో పొల్లాచ్చి షెడ్యూల్ లో షూటింగ్ కు సంబంధించిన విశేషాలతో కూడిన వీడియోను చిత్ర బృందం పంచుకుంది. అక్కడ కొంత టాకీతో పాటు, యాక్షన్ సీక్వెన్స్ కూడా తీసినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది.

'వాల్తేరు వీరయ్య' విజయం తర్వాత చిరు - బాబీ నుంచి వస్తున్న సినిమా కావడంతో దీనిపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. దీనికి తగ్గట్లే ఈసారి ఓ చక్కటి భారీ మాస్ యాక్షన్ ఎంటర్ టైనర్ గా ఈ చిత్రాన్ని ముస్తాబు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో చిరు రెండు కోణాల్లో సాగే పాత్రలో అలరించే అవకాశమున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రానికి సంగీతం తమన్, ఛాయాగ్రహణం విజయ్ కార్తీక్ కన్నన్ అందిస్తున్నారు.

# ఇంగ్లాండ్‌కు ఐసీసీ భారీ షాక్!




## 12 ఓవర్లకు 12 పాయింట్లు కోత..

న్యూజిలాండ్ తో మూడు టెస్టుల సిరీస్ లో ఇంగ్లాండ్ 1-1తో సమంగా ఉంది. మొదటి మ్యాచ్ లో ఇంగ్లాండ్ గెలవగా.. రెండో మ్యాచ్ లో కివీస్ 253 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. రెండో టెస్టుకు రెగ్యులర్ సారథి బెన్ స్టోక్స్ దూరం కాగా.. ఘోర పరాజయం చవిచూసింది. ఈ క్రమంలో ఇంగ్లాండ్ కు ఐసీసీ గట్టి షాక్ ఇచ్చింది. ఈ జట్టుకు పాయింట్లను తగ్గించింది. ఇప్పటికే పర్సంటేజీ తగ్గగా.. పాయింట్లలోనూ భారీగా కోత పడటంతో డబ్ల్యూటీసీ ఫైనల్ ఆశలు మరింత సంక్లిష్టంగా మారాయి. ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ లో ఇంగ్లాండ్ ఏడో స్థానంలో ఉంది.

ఆదివారం న్యూజిలాండ్ తో రెండో టెస్టులో ఇంగ్లాండ్ ఓడిపోయింది. దీంతో డబ్ల్యూటీసీ పట్టికలో ఈ జట్టు పర్సంటేజీ 34.72 నుంచి 26.38 శాతానికి పడిపోయింది. రెండో టెస్టు మ్యాచ్ కు ముందు ఇంగ్లాండ్ ఖాతాలో 50 పాయింట్లు ఉన్నాయి. కానీ, ఈ టెస్టులో ఏకంగా 12 ఓవర్లను ఆలస్యంగా వేయడంతో 12 పాయింట్లను కోల్పోవాల్సి వచ్చింది. దీంతో పాయింట్ల సంఖ్య 50 నుంచి 38కి తగ్గింది. కెప్టెన్ గా వ్యవహరించిన జో రూట్ తోపాటు సహచరులందరికీ మ్యాచ్ ఫీజులో 50 శాతం జరిమానాగా పడింది.

**బెన్ స్టోక్స్ వచ్చేశాడు..**

స్వదేశంలో సిరీస్ ను సొంతం చేసుకోవాలనే లక్ష్యంతో ఉన్న ఇంగ్లాండ్ కు ఓ గుడ్ న్యూస్. బాక్సర్ తో గొడవ కారణంగా రెండో టెస్టు ఆడలేకపోయిన కెప్టెన్ బెన్ స్టోక్స్ మళ్లీ జట్టులోకి వచ్చాడు. కివీస్ తో మూడో టెస్టు కోసం ప్రకటించిన స్క్వాడ్ లో అతడికి చోటు దక్కింది. కెప్టెన్ రాకతో తుది జట్టులో ఎవరిని పక్కన పెడతారో చూడాలి. జూన్ 25 నుంచి నాటింగ్ హామ్ వేదికగా మూడోటెస్టు ప్రారంభం కానుంది.





## 2027 వన్డే ప్రపంచకప్.. రోడ్ మ్యాప్ సిద్ధం!

వన్డే ప్రపంచ కప్ 2027 టోర్నీకి నిర్దిష్టమైన ప్రణాళిక (రోడ్మ్యాప్)ను రూపొందించడం ప్రారంభమైందని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు. ప్రపంచ కప్ ముందు టీమ్ఇండియా తగినన్ని 50 ఓవర్ల క్రికెట్ మ్యాచులు ఆడేలా చూస్తామని తెలిపారు. ''వచ్చే ఏడాది అక్టోబర్ లో టోర్నీ ప్రారంభం కానుంది. ఇప్పటికే ఇంగ్లాండ్ తో మూడు వన్డేల సిరీస్ ను భారత్ ఆడనుంది. జులై 14 నుంచి 19 వరకు ఆ సిరీస్ జరగనుంది. రాబోయే కాలంలో మరిన్ని మ్యాచులను నిర్వహించేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాం. మ్యాచ్ ప్రాక్టీస్ వల్ల కప్పు గెలిచేందుకు అవకాశాలు మెరుగవుతాయని'' అని సైకియా పేర్కొన్నారు.

## నాలుగేళ్ల కిందట సెరెనా రిటైర్ మెంట్.. వైల్డ్ కార్డుతో రీఎంట్రీ



సెరెనా విలియమ్స్.. అమెరికా టెన్నిస్ దిగ్గజం. నాలుగేళ్ల కిందట ప్రొఫెషనల్ టెన్నిస్ కు వీడ్కోలు పలికిన ఈ స్టార్ మళ్లీ రాకెట్ తో బరిలోకి దిగేందుకు సిద్ధమైంది. మరో వారం రోజుల్లో ప్రారంభం కానున్న వింబుల్డన్ లో అడుగు పెట్టనుంది. నిర్వాహకులు ఇప్పటికే ఆమెకు వైల్ కార్డు ఎంట్రీ ఇచ్చారు. మహిళల సింగిల్స్ ఈవెంట్ లో ఆమె పునరాగమనంపై వింబుల్డన్ ఛాంపియన్ షిప్ సోషల్ మీడియాలో ప్రత్యేక పోస్టు పెట్టింది. ''ఇది డ్రిల్ కాదు.. 2026 వింబుల్డన్ మహిళల సింగిల్స్ లో వైల్ కార్డు ఎంట్రీతో సెరెనా విలియమ్స్ పోటీ పడనుంది'' అని సెరెనా ఇమేజ్ ను పోస్టు చేసింది. సెరెనా సోదరి వీనస్ విలియమ్స్ కూ డబుల్స్ లో వైల్ కార్డ్ ఎంట్రీ దక్కింది.



## అదంతా ముగిసిపోయింది: విరాట్ కోహ్లి



టీమ్ఇండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి గతేడాది టెస్టు క్రికెట్కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. కెప్టెన్ గా భారత జట్టుకు అద్భుత విజయాలు అందించిన అతడు.. ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. వచ్చే ఏడాది వన్డే ప్రపంచ కప్ లో ఆడి అంతర్జాతీయ క్రికెట్ కు గుడ్ బై చెప్పేస్తాడనే అంచనాలున్నాయి. అయితే, ఇప్పటికీ ఫిట్గా.. ఫామ్ లో ఉన్న కోహ్లి టెస్టుల్లో పునరాగమనం చేయాలని కోరుకొనేవారు లేకపోలేదు. తాజాగా ఓ ఈవెంట్ లో పాల్గొన్న విరాట్ కోహ్లికి ఇలాంటి ప్రశ్నే ఎదురైంది. దీనికి అతడు చాలా లౌక్యంగా సమాధానం ఇవ్వడం గమనార్హం.

స్పోర్ట్స్ బ్రాండ్ వన్8 లాంచ్ ఈవెంట్ కు విరాట్ కోహ్లి హాజరయ్యాడు. ఈ బ్రాండ్ లోని ఓ షూ ధర రూ. 9,230గా ఉంది. టెస్టుల్లో విరాట్ సాధించిన పరుగుల సంఖ్య కూడా అంతే. దానికి కోట్ చేస్తూ.. కార్యక్రమానికి హోస్ట్ గా ఉన్న కమెడియన్ డానిష్ సైత్ ఓ ప్రశ్న సంధించాడు. ''మీరు ఇంకొన్ని పరుగులు చేసి.. ఆ వస్తువు లాభాలను పెంచొచ్చు కదా?'' అని విరాట్ ను అడిగాడు. దీనికి కోహ్లి బదులిస్తూ.. ''నేను తక్కువ ధరకే అమ్మేయడానికి ఇష్టపడతాను. ఇక మీరు అడుగుతున్న దానితో (టెస్టు క్రికెట్) నా పని అయిపోయింది. ధన్యవాదాలు'' అని చెప్పాడు. దీంతో విరాట్ మళ్లీ టెస్టుల్లోకి పునరాగమనం చేసే అవకాశాలు లేవని స్పష్టమైందని క్రికెట్ వర్గాలు తెలిపాయి.



నటి సమంత ప్రస్తుతం హ్యాపీ మోడ్ లో ఉన్నారు. సుదీర్ఘ విరామం తర్వాత ఆమె నటించిన 'మా ఇంటి బంగారం' విజయం సాధించింది. మరోవైపు ఆమె తల్లి కానుందనే వార్తలు కూడా వస్తున్నాయి. ఈ నేపథ్యంలో తనకు పుట్టే పిల్లల గురించి సమంత గతంలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.

కొన్నేళ్ల క్రితం ఓ ఇంటర్వ్యూలో సమంత మాట్లాడుతూ.. ''నా బిడ్డే నా ప్రపంచం అవుతుంది. ఉద్యోగం చేసుకుంటూ పిల్లలను, ఇంటి బాధ్యతలను చూసుకునే మహిళంటే

# నా బిడ్డే నా ప్రపంచం అవుతుంది: సమంత

నాకెంతో గౌరవం'' అని అన్నారు. అదే ఇంటర్వ్యూలో తన బాల్యం గురించి కూడా పంచుకున్నారు. ''నా చిన్నప్పుడు ఎన్నో కష్టాలు పడ్డాను. అలాంటి బాల్యం గడిపిన వారంతా వారి పిల్లలకు విలాసవంతమైన, సౌకర్యవంతమైన జీవితాన్ని ఇవ్వాలనుకుంటారు. నేను కూడా అదే నిర్ణయించుకున్నా. నా బిడ్డ పుట్టిన తర్వాత కొన్ని సంవత్సరాల పాటు తనను వదిలి ఎక్కడికీ వెళ్లను. తనే నా సర్వస్వంగా చూసుకుంటా'' అని చెప్పారు.



తాజాగా జరిగిన 'మా ఇంటి బంగారం' సక్సెస్ సెలబ్రేషన్స్ లో సమంత బేబి బంప్ తో కనిపించారు. ఈ విషయంపై ఆమె సన్నిహిత వర్గాలను అడగ్గా.. సమంత, రాజ్ లకు ఇది చాలా ప్రత్యేకమైన సమయం అని.. వాళ్లిద్దరూ కొత్త ప్రయాణానికి సిద్ధమవుతున్నారని వెల్లడించాయి. దీంతో త్వరలోనే సామ్ ఈ గుడ్ న్యూస్ ను అధికారికంగా వెల్లడిస్తారని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

**మిలియన్ డాలర్ల క్లబ్ లోకి 'మా ఇంటి బంగారం'..**

సమంత నటించిన తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' హిట్ టాక్ తో బాక్సాఫీసు వద్ద దూసుకుపోతోంది. మూడు రోజుల్లో రూ.43 కోట్లు వసూలు చేసింది. నార్త్ అమెరికాలో వన్ మిలియన్ డాలర్ల క్లబ్లో చేరింది. సోషల్ మీడియాలోనూ ఈ సినిమాకు సంబంధించిన రీల్స్ వైరల్ గా మారాయి.

**సామ్ నువ్వు అర్హురాలివి: నయనతార విషెస్**

'మా ఇంటి బంగారం' విజయం సాధించడంతో అభిమానులు, సెలబ్రిటీలు సమంతకు విషెస్ తెలుపుతున్నారు. తాజాగా నటి నయనతార ఈ చిత్రబృందానికి అభినందనలు తెలిపారు. 'సామ్ నీ విషయంలో ఎంతో హ్యాపీగా ఉంది. ఈ విజయానికి నువ్వు అర్హురాలివి' అని పోస్ట్ పెట్టారు. దీనికి సమంత స్పందిస్తూ 'డార్లింగ్ నయన్' అంటూ హార్ట్ ఎమోజీలను జోడించారు.




## జాన్వీ కపూర్ ప్రియుడు అతనే.. హింట్ ఇచ్చిందిగా..!


బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ పెద్ది మూవీతో మరో హిట్ తన ఖాతాలో వేసుకుంది. రామ్ చరణ్ హీరోగా వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ గా నిలిచింది. ఈ మూవీ అచ్చియమ్మ పాత్రలో మెప్పించింది బాలీవుడ్ భామ. అయితే ఆమె రోల్ పై పెద్దఎత్తున విమర్శలు రావడంతో ఆమె సీన్స్ ను కొన్నింటిని తొలగించారు. పెద్ది మూవీతో తన గ్లామర్ తో అభిమానులను ఆకట్టుకుంది.

ఇక సినిమా సంగతి పక్కనపెడితే తాజాగా ఈ బ్యూటీ తన ప్రేమ, ప్రియుడి గురించి హింట్ ఇచ్చింది. తాను ధరించిన టీ షర్ట్ పై క్యూట్ కొటేషన్ రాసుకొచ్చింది. ఒకవేళ నేను తప్పిపోతే నా ప్రియుడికి అప్పజెప్పండి ప్లీజ్.. శిఖర్ పహారియా పేరు రాసిన టీ షర్టు ధరించింది. చూసేందుకు ఇదంతా ఫన్నీగా ఉన్నా.. ఈ ముద్దుగుమ్మ తన లవ్ గురించి ఓపెన్ గానే చెప్పినట్లు ఉందంటున్నారు. ఇది కాస్తా వైరల్ కావడంతో జాన్వీ కపూర్.. ప్రియుడు శిఖర్ పహారియానే అంటూ కామెంట్స్ చేస్తున్నారు.

# విజయ్ మాల్యా పాత్రలో అర్జున్ రామ్ పాల్

మన దేశంలోని బ్యాంకులకు దాదాపు రూ.9 వేల కోట్ల మేర రుణాల ఎగవేత కేసులో నిందితుడిగా ఉన్న వ్యాపారవేత్త విజయ్ మాల్యా పాత్రలో ప్రముఖ బాలీవుడ్ నటుడు అర్జున్ రామ్పాల్ నటించబోతున్నట్లు కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. 'బిలియనీర్' పేరుతో రూపొందనున్న వెబ్ సిరీస్ లో ఆయన విజయ్ మాల్యాగా కనిపించనున్నట్లు వార్తలు వస్తున్నాయి.

తాజాగా ఈ వెబ్ సిరీస్ నిర్మాత ప్రభ్ లీన్ సంధు దీనిపై స్పష్టతనిచ్చారు. 'బిలియనీర్'లో విజయ్ మాల్యా పాత్ర లేదని, అయితే ఆయన జీవితం ఆధారంగా ఓ పాత్రను తీర్చిదిద్దినట్లు ఆమె చెప్పారు. అందులో అర్జున్ రామ్ పాల్ నటిస్తారని స్పష్టం చేశారు. 'దురంధర్'లో తన నటనతో ప్రేక్షకులను విశేషంగా అలరించిన అర్జున్ రామ్పాల్ తో కలసి పనిచేసేందుకు తాము ఆసక్తితో ఎదురుచూస్తున్నట్లు ప్రభ్ లీన్ చెప్పారు. ఈ సిరీస్ కు హన్సల్ మెహతా, రాబీ గ్రేవాల్ దర్శకత్వం వహించనున్నారు.





Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151, And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.